




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 335 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు బుధవారం 5 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :335 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE WED 5 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## నిరుద్యోగ సంక్షోభం.. మోదీ సర్కార్‌కు పెనుసవాల్.. బీబీసీ ప్రత్యేక కథనం!



- పరీక్ష పత్రాల లీక్‌పై యువత ఆగ్రహం.. కేంద్ర మంత్రి రాజీనామా
- దేశంలో తీవ్రమవుతున్న నిరుద్యోగ సంక్షోభంపై నిపుణుల ఆందోళన
- విద్యా వ్యవస్థ వైఫల్యం, పడిపోతున్న ఉపాధి అవకాశాలు

- మిగతా 2లో

## జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత

- రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం
- వైసీపీలో చేరిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు
- గూడపాటిని పార్టీలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామన్న జగన్

- మిగతా 2లో



## సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం.. ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ మృతి


పెన్ పవర్ డెస్క్:సై, గజినీ, ఛత్రపతి మొదలైన బ్లాక్ బస్టర్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ కన్ను మూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం

- మిగతా 2లో



# వాళ్లది విధ్వంసం, మాది పునర్నిర్మాణం..

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు




- గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం రూ.9.74 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని సీఎం.
- రెండేళ్లలో రూ.1.49 లక్షల కోట్ల సంక్షేమం, రూ.30,607 ప్రభుత్వ ఉద్యోగాలు అందించామని వెల్లడి.
- అమరావతి, పోలవరం పూర్తి చేసి తీరతామని స్పష్టం.
- విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ట్రిపుల్ ఇంజన్ గ్రోత్ వ్యూహం.
- సంక్షేమం ఆగదు.. అభివృద్ధి ఆగదని చంద్రబాబు.

- మిగతా 2లో

| ఆర్థిక గణాంకాలు | రెండేళ్లలో సంక్షేమం | ఉద్యోగాల కల్పన |
|---|---|---|
| మొత్తం అప్పులు రూ. 9.74 లక్షల కోట్లు | రూ. 1,49,401 కోట్లు | 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు |

### దిద్దుబాటు చర్యలు

- పెండింగ్ బిల్లుల్లో రూ.29,000 కోట్లకు పైగా చెల్లింపు.
- ఉద్యోగుల బకాయిలు రూ.30,849 కోట్లు క్లియర్.
- రీ-నెగోషియేషన్ ద్వారా రూ.8,269 కోట్ల ఆదా.
- 86 కేంద్ర ప్రాయోజిత పథకాల పునరుద్ధరణ.
- రూ.29,890 కోట్ల కేంద్ర నిధుల సమీకరణ

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నాడు శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనను "విధ్వంసం"గా అభివర్ణిస్తూ, తమ ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్నది "పునర్నిర్మాణం" అని స్పష్టం చేశారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని, సంస్థలను నిర్వీర్యం చేసి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో చేపట్టిన దిద్దుబాటు చర్యలు, భవిష్యత్ ప్రణాళికలను ఆయన సమగ్రంగా వివరించారు.

**గత ఐదేళ్లది విధ్వంసం.. మాది పునర్నిర్మాణం**

2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, ఇది ఒక నిశ్శబ్ద విప్లవం అని చంద్రబాబు అభివర్ణించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులు నెలకొన్నాయని, స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి కూడా లేదని అన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలన ప్రారంభమైందని, అమరావతిని ఆపేసి, పోలవరాన్ని నిర్వీర్యం చేసి, పారిశ్రామికవేత్తలను తరిమికొట్టి "బ్రాండ్ ఆంధ్రప్రదేశ్"ను పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సహకారంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు అనునిత్యం శ్రమిస్తున్నామని తెలిపారు.



## నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

### మంత్రి లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు

- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు భేటీ
- నైతిక విలువలతో కూడిన విద్య ఆవశ్యకతపై కీలక చర్చ
- విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువల బోధనపై సమీక్ష

- మిగతా 2లో

## విద్యుత్ ఛార్జీలు పెంచలేదు, ట్రూడౌన్ చేశాం

- అస్తవ్యస్తమైన విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టామన్న మంత్రి గొట్టిపాటి
- ఛార్జీలు పెంచకుండా ట్రూడౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని వెల్లడి
- పీఎం సూర్య ఘర్ పథకాన్ని రాష్ట్రంలో పూర్తిగా అమలు చేస్తామని స్పష్టం
- జగన్ హయాంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని విమర్శ
- రాష్ట్రవ్యాప్తంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగవంతం చేశామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచకుండా 'ట్రూ డౌన్' చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. విద్యుత్ శాఖలో సాధించిన ప్రగతిపై శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో వ్యవస్థలను చక్కదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాం. జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలూ సర్వనాశనం అయ్యాయి. మేము వాటిని బాగుచేస్తున్నాం" అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం సూర్య ఘర్' పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా వినియోగించుకుని,

- మిగతా 2లో



## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు

### లోక్‌సభలో కేంద్రం వెల్లడి

- గత రెండున్నరేళ్లలో ఏపీకి ప్రత్యేక సాయం
- గత వైసీపీ ప్రభుత్వం కంటే అధికంగా నిధులు సాధించిన కూటమి ప్రభుత్వం
- లోక్‌సభలో వైసీపీ ఎంపీ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ అధికారిక సమాధానం
- ఆర్థిక క్రమశిక్షణ, సమర్థవంతమైన అమలు వల్లే ఇది సాధ్యమైందన్న రాష్ట్ర ప్రభుత్వం
- మూలధన వ్యయం కోసం కేంద్రం 50 ఏళ్లకు వడ్డీలేని రుణాలు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా ఆర్థిక చేయూత లభించింది. "రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయ పథకం" (ఎస్ఏఎస్‌సీఐ) కింద గత రెండున్నరేళ్ల కాలంలోనే రాష్ట్రానికి రూ.19,619 కోట్లు అందాయని కేంద్ర

- మిగతా 2లో



### ఆలస్యం చేస్తే చాలా కష్టం.. జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

## పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

- ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు
- రెండేళ్లు దాటితే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం
- దేశంలో 99 శాతానికి పైగా పెరిగిన జనన, మరణాల నమోదు
- గుర్తింపు మోసాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపిన కేంద్రం

పెన్ పవర్ డెస్క్:దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది.

- మిగతా 2లో



## ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్



- తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు
- 7 పేజీలతో నివేదికను పీసీసీ చీఫ్ కు అందించిన జగ్గారెడ్డి
- అందరి నుంచి అభిప్రాయాలను సేకరించి నివేదికను తయారు చేశామన్న జగ్గారెడ్డి

- మిగతా 2లో

## అహంకారం వినాశనానికి దారితీస్తుంది

### విజయ్ ప్రభుత్వంపై స్టాలిన్ తీవ్ర ఆగ్రహం



- త్రిషపై వ్యాఖ్యల కేసులో ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్, విడుదల
- అధికార టీవీకే అహంకారంతో వ్యవహరిస్తోందన్న ఎంకే స్టాలిన్
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఈ చర్యలని ఆరోపణ

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## విడదల యాక్టివ్ అవ్వడానికి కారణమదేనటగా?

వైసీపీ నేత విడదల రజని మళ్లీ చిలకలూరి పేట నియోజకవర్గంలో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. వైసీపీ నుంచి తిరిగి చిలకలూరి పేట నియోజకవర్గం నుంచి గెలిచేందుకు ఆమె ఉవ్విళ్లూరుతున్నారు. చిలకలూరి పేట నియోజకవర్గంలో జరిగే వైసీపీ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటూ తిరిగి నియోజకవర్గంలో తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ నాయకత్వం కూడా చిలకలూరి పేట ఇన్ ఛార్జిగా విడదల రజనిని నియమించడంతో ఆమె మరొకసారి గెలిచి తన సత్తా చూపాలని చూస్తున్నారు. ఇటీవల జరిగిన వెన్నుపోటు కు రెండేళ్లు కార్యక్రమాన్ని కూడా విజయవంతంగా నిర్వహించినట్లు పార్టీ నాయకత్వానికి నివేదికలు అందాయి.

విడదల రజని 2014లో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు శిష్యురాలిగా తెలుగుదేశం పార్టీలో చేరి రాజకీయాల్లోకి వచ్చారు. విఆర్ ఫౌండేషన్ స్థాపించి నియోజకవర్గంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. 2019 ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. టీడీపీ నుండి ప్రత్తిపాటి పుల్లారావు అక్కడ పోటీ చేస్తుండడంతో 2018లో వైసీపీలో చేరారు. ఆమె 2019 ఎన్నికల్లో చిలకలూరి పేట నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు పై 8301 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2022 ఏప్రిల్ 11న జరిగిన మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా జగన్ మంత్రివర్గంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. విడదల రజని 2024లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో గుంటూరు పశ్చిమ నుండి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి గళ్ళా మాధవి చేతిలో 51150 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

సామాజికవర్గం పరంగా... విడదల రజని ఆర్థికంగా బలమైననేత. సామాజికవర్గం పరంగా కూడా ఆమెకు కలసి వచ్చే అంశమే. భర్త కాపు సామాజికవర్గం కావడం కూడా ఆమెకు రాజకీయంగా కలసి వస్తుందని అంటున్నారు. విడదల రజని కుటుంబం విదేశాల్లో వ్యాపారాలు చేసి బాగానే సంపాదించారు. ఆమెతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై వరసగా కేసులు కూడా నమోదు అవుతుండటం విడదల రజనిపై సానుభూతి పెరిగిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. బీసీ ం కాపు సామాజికవర్గం కలగలిపి ఉండటంతో ఖచ్చితంగా గెలుపు గుర్రం ఎక్కుతారని వైసీపీ నాయకత్వం కూడా అంచనా వేస్తుంది. విడదల రజనికి పార్టీ నాయకత్వం అండగా కూడా పుష్కలంగా ఉండటంతో ఈసారి చిలకలూరి పేట నుంచి పోటీ చేయడం ఖాయమని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. అక్కడ బలమైన నేతగా విడదల రజని ముద్ర పడ్డారు.

## నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

ప్రముఖ ప్రవచనకర్త, నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మంగళవారం రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో.. విద్యా వ్యవస్థలో నైతిక విలువల ప్రాముఖ్యత, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే అంశాలపై వీరిద్దరి మధ్య కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులను సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలంటే నైతిక విలువలతో కూడిన విద్య అందించడం ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. చిన్నతనం నుంచే పిల్లల్లో మానవతా విలువలు, క్రమశిక్షణ, నైతికత వంటి గుణాలను పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన మంత్రికి వివరించారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, సంపూర్ణ వికాసం దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చాగంటి కోటేశ్వరరావు దిశానిర్దేశంలో రూపొందించిన నైతిక విలువల పాఠ్యాంశాలను 'నో బ్యాగ్ డే' రోజున బోధిస్తున్న సంగతి తెలిసిందే. నైతిక విలువలతో కూడిన విద్య ద్వారానే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగస్వామి కావడం పట్ల చాగంటి సంతోషం వ్యక్తం చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి లోకేశ్ స్వయంగా చాగంటి గారిని కారు వద్దకు వచ్చి వినయపూర్వకంగా సాగనంపారు.

## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం మంగళవారం నాడు లోక్‌సభలో ప్రకటించింది. 2020 నుంచి 2024 మధ్య గత వైసీపీ ప్రభుత్వం సాధించిన రూ. 11,386 కోట్లతో పోలిస్తే ఇది అధికమని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ఈ వివరాలను అధికారికంగా సమర్పించింది. ఆర్థిక క్రమశిక్షణను పాటించడం, ప్రాజెక్టుల ప్రతిపాదనలను సకాలంలో సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేయడం వల్లే స్వల్ప కాలంలోనే ఎక్కువ నిధులను సాధించగలిగామని తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ. 31,005.47 కోట్లు అందాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రూ. 19,619 కోట్లు విడుదలయ్యాయి. 2024-25లో రూ. 7,901.56 కోట్లు, 2025-26లో రూ. 8,289.61 కోట్లు, 2026-27లో ఆగస్టు 1 నాటికి రూ. 3,428.14 కోట్లు మంజూరయ్యాయి. మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు 50 ఏళ్ల కాలపరిమితితో వడ్డీ లేని రుణాలను అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం.

గత ప్రభుత్వ హయాంలో 2020-21లో రూ. 688 కోట్లు, 2022-23లో రూ. 6,105 కోట్లు, 2023-24లో రూ. 4,090.81 కోట్లు ఈ పథకం కింద అందాయి. మరోవైపు, రాష్ట్ర విభజన జరిగిన 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు రూ. 16,078.76 కోట్లుగా అకౌంటెంట్ జనరల్ నిర్ధారించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అదే ఎంపీకి ఇచ్చిన మరో సమాధానంలో తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనానుభవం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించి సమ్మిళిత వృద్ధిని సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది.

# వాళ్లది విధ్వంసం, మాది పునర్నిర్మాణం..

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు

**విభజన నష్టం కంటే విధ్వంసమే ఎక్కువ**

2014లో రాష్ట్ర విభజన బాధాకరమైనప్పటికీ, 2019-24 మధ్య జరిగిన విధ్వంసం అంతకంటే భయంకరమైన మానసిక వేదనను మిగిల్చిందని చంద్రబాబు అన్నారు. విభజన సమయంలో 58% జనాభాకు 46% వనరులే వచ్చాయని, అయినా ఐదేళ్లలో కష్టపడి ఆర్థిక వ్యవస్థను ఒక దారికి తెచ్చామని గుర్తుచేశారు. కానీ, గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ నాశనం చేసిందని, అధికారుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి, రాష్ట్రాన్ని అగమ్యగోచర స్థితిలోకి నెట్టిందని విమర్శించారు.

**ఆర్థిక గమనం.. రాష్ట్రాల మధ్య వ్యత్యాసం**

గత ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య తలసరి ఆదాయంలో వ్యత్యాసం విపరీతంగా పెరిగిపోయిందని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "2014-15లో తెలంగాణ, ఏపీ మధ్య తలసరి ఆదాయ వ్యత్యాసం రూ.30,201గా ఉండేది. మా ఐదేళ్ల పాలనలో దాన్ని రూ.25,000కు తగ్గించగలిగాం. కానీ, 2019-24 మధ్య కాలంలో ఈ వ్యత్యాసం ఏకంగా రూ.1,06,854కు పెరిగిపోయింది. ఒకవేళ 2014-19 మధ్య సాధించిన 13.5% వృద్ధిరేటు కొనసాగి ఉంటే, రాష్ట్రానికి అదనంగా రూ.76,195 కోట్ల ఆదాయం వచ్చేది. అప్పుడు అప్పులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు" అని ఆయన విశ్లేషించారు.

**అప్పుల ఊబిలోంచి బయటపడేస్తున్నాం**

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.9.74 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచిందని, నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఏపీ 'జీరో డెట్ సస్టైనబిలిటీ' స్థితికి చేరిందని, అంటే అప్పు పుట్టని దుస్థితికి వచ్చిందని చంద్రబాబు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక పెండింగ్‌లో ఉన్న రూ.48,616 కోట్ల బిల్లుల్లో ఇప్పటికే రూ.29,000 కోట్లకు పైగా చెల్లించామని, ఉద్యోగుల బకాయిలు రూ.30,849 కోట్లు క్లియర్ చేశామని వివరించారు. అధిక వడ్డీలకు తీసుకున్న రూ.50,000 కోట్ల విలువైన 370 రుణాలను పునఃసమీక్షించి (రీ-నెగోషియేట్), ఏటా రూ.1,100 కోట్ల చొప్పున మొత్తం రూ.8,269 కోట్ల ఆదా చేశామన్నారు. నిధులు పక్కదారి పట్టడంతో నిలిచిపోయిన 86 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించి, రూ.29,890 కోట్లు డ్రా చేయగలిగామని తెలిపారు.

**సంక్షేమానికి పెద్దపీట.. అభివృద్ధికి బాటలు**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ హామీలను నెరవేర్చడంలో వెనకడుగు వేయలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. గత రెండేళ్లలో సంక్షేమ పథకాల కోసం రూ.1,49,401 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా కింద రూ.68,296 కోట్లు, తల్లికి వందనం కింద రూ.20,210 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.8,724 కోట్లు అందించామన్నారు. దీంతో పాటు, రెండేళ్లలో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ఇందులో 15,941 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ చేపట్టామని గుర్తుచేశారు.

**P4, కుటుంబ సాధికారతతో పేదరిక నిర్మూలన**

సంక్షేమం అంటే కేవలం డబ్బులు ఇవ్వడమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. ఇందుకోసం 'కుటుంబ సాధికారత మిషన్' ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యానికి ప్రజల భాగస్వామ్యాన్ని జోడించి P4 అనే నూతన విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. 'మార్గదర్శి బంగారు కుటుంబం' (వీడీఖ 10-20) పథకం కింద సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న 10% మంది, వెనుకబడిన 20% కుటుంబాలను దత్తత తీసుకుని వారిని ఆర్థికంగా పైకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

**అమరావతి, పోలవరం పూర్తి చేసి తీరతాం**

అమరావతి ప్రజల రాజధాని అని, అది ఒక సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఫేజ్-1 పనుల కోసం ఇప్పటికే రూ.41,000 కోట్లకు పైగా నిధులు సమీకరించామని, త్వరలోనే పనులు వేగవంతం చేస్తామని తెలిపారు. అదేవిధంగా, రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును మార్చి నాటికి పూర్తిచేసి ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ప్రకటించారు. దీనికోసం రూ.12,157 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

**మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ట్రిపుల్ ఇంజన్ వ్యూహం**

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 'డబుల్ ఇంజన్ సర్కార్ - ట్రిపుల్ ఇంజన్ గ్రోత్' వ్యూహాన్ని అనుసరిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రాన్ని మూడు ఆర్థిక రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.

1. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (VER): పోర్ట్ ఆధారిత తయారీ, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ, డేటా సెంటర్ల హబ్‌గా అభివృద్ధి చేస్తారు. సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 లక్షల ఉద్యోగాలు లక్ష్యం.
2. అమరావతి ఎకనామిక్ రీజియన్ (AER): పరిపాలన, నాలెడ్జ్ క్యాపిటల్‌గా, ఏఐ, క్వాంటం, డేటా సెంటర్ల కేంద్రంగా తీర్చిదిద్దుతారు. రూ.6-8 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం.
3. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (TER): స్పేస్, డిఫెన్స్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, రెన్యువబుల్ ఎనర్జీ హబ్‌గా అభివృద్ధి చేస్తారు. రూ.10-12 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 లక్షల ఉద్యోగాలు లక్ష్యం.

**ముందున్న సవాళ్లు.. భవిష్యత్ ప్రణాళిక**

రాష్ట్ర సొంత ఆదాయంలో 98% ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతోందని, ఇది కర్ణాటక (28%), తెలంగాణ (44%)తో పోలిస్తే చాలా అధికమని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాయాన్ని పెంచుకుంటూ, ఖర్చులను అదుపు చేస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పిపిపి, వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ (VGF) ద్వారా మూలధన వ్యయాన్ని పెంచుతామని తెలిపారు. అంతిమంగా రాష్ట్రాన్ని ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్ది, 'స్వర్ణాంధ్ర విజన్ 2047' సాధించడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవ ర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరు అంశంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. మొత్తం 7 పేజీలతో కూడిన ఈ రిపోర్టును సీల్డ్ కవర్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆయన అందజేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలు, వర్గ విభేదాలపై గత పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాలు, స్థానిక నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఆ వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నివేదికను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే 'ఫస్ట్ బాస్' అని, ఆ తర్వాతి స్థానంలోనే ఎంపీ, మంత్రులు ఉంటారని స్పష్టం చేశారు. అలాగే మూడో ప్రాధాన్యత డీసీసీ అధ్యక్షుడికి ఉంటుందని వ్యాఖ్యానించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఈ నివేదికలో పొందుపరిచామని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు ప్రధాన స్తంభాలని ఈ సందర్భంగా జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత

బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రేపల్లెకు చెందిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు వైసీపీలో చేరారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. గూడపాటికి వైసీపీ కండువా కప్పి జగన్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... గూడపాటి శ్రీనివాసరావును వైసీపీ కుటుంబంలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు. గూడపాటి శ్రీనివాసరావు చేరికతో రేపల్లె నియోజకవర్గంలో వైసీపీ మరింత బలపడిందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. రానున్న రోజుల్లో క్షేత్రస్థాయి బలాబలాల దృష్ట్యా రేపల్లె నియోజకవర్గ రాజకీయం మరింత ఆసక్తికరంగా మారనుంది.

## నిరుద్యోగ సంక్షోభం.. మోదీ సర్కార్‌కు పెనుసవాల్.. బీబీసీ ప్రత్యేక కథనం!

పరీక్ష పత్రాల లీకేజీ ఉదంతాలపై దేశవ్యాప్తంగా యువత నిరసనలతో అట్టుడగడంతో, గత నెలలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామంతో మోదీ ప్రభుత్వం తాత్కాలికంగా సంక్షోభం నుంచి గట్టెక్కినప్పటికీ, యువతలో పేరుకుపోతున్న అసంతృప్తి భవిష్యత్తులో ప్రభుత్వానికి దీర్ఘకాలిక సవాల్‌గా మారనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ వార్తా సంస్థ బీబీసీ ఓ కథనం వెలువరించింది. లీకేజీ కేసుల విచారణ నిమిత్తం ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని, పరీక్షా వ్యవస్థలో సంస్కరణల కోసం టెక్ నిపుణుడు నందన్ నీలేకని నేతృత్వంలో కమిటీని నియమిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అయినప్పటికీ, తగిన ఉపాధి అవకాశాలు కల్పనలోనూ, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన విద్యను అందించడంలోనూ విఫలమవుతున్న ప్రస్తుత వ్యవస్థపై యువతలో అసహనం పెరుగుతోంది. వారి ఆందోళనలను నివృత్తి చేయడానికి ప్రభుత్వం మరింత నిర్మాణాత్మకమైన ప్రయత్నాలు చేయాల్సి ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రముఖ ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా బీబీసీతో మాట్లాడుతూ, "గత దశాబ్ద కాలంలో కార్మిక మార్కెట్ స్థితుగతులు క్షీణించాయి. వ్యవసాయేతర ఉద్యోగాల సృష్టి మందగించడంతో పాటు, వాస్తవ వేతనాలు కూడా స్తంభించిపోయాయి" అని వెల్లడించారు. బలహీనమైన ఆర్థిక వ్యవస్థ వల్ల ఉద్యోగాలకు గిరాకీ పెరగడం లేదని, మరోవైపు మన విద్యా వ్యవస్థ సైతం నాణ్యమైన మానవ వనరులను అందించడంలోవెనుకబడి ఉందని ఆయన విశ్లేషించారు.

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2026' నివేదిక ప్రకారం, ప్రస్తుతం పట్టభద్రుల్లో నిరుద్యోగిత రేటు గత 25 ఏళ్ల నాటి తరహాలోనే 35-40 శాతం వద్ద కొనసాగుతోంది. అయితే, పెరిగిన జనాభా దృష్ట్యా సమస్య తీవ్రత మరింత అధికంగా కనిపిస్తోంది. 2023 నాటికి 67 శాతం మంది గ్రాడ్యుయేట్లకు సరైన ఉపాధి లేదని ఈ నివేదిక స్పష్టం చేసింది. అదేవిధంగా, జీడీపీలో తయారీ రంగం వాటా 17 శాతం నుంచి 14 శాతానికి తగ్గడం, కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఐటీ రంగంలో నియామకాలు మందగించడం ఈ సంక్షోభాన్ని మరింత జఠిలం చేస్తున్నాయి.

కేవలం ఏసీ కార్యాలయాల్లోని ఉద్యోగాలనే ఆశించకుండా, నైపుణ్యం ఆధారిత వృత్తులైన ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ వంటి పనులను కూడా చేపట్టేందుకు యువత సిద్ధపడాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుత యువత తమ తల్లిదండ్రుల కంటే మెరుగైన జీవన ప్రమాణాలను పొందలేని పరిస్థితులు నెలకొన్నాయని, ఇది దేశానికి పెను ముప్పుగా పరిణమించకుండా మోదీ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం.. ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ మృతి

- మొదటి పేజి తరువాయి

(ఆగస్టు 04) ముంబయిలో గుండెపోటుతో మృతి చెందారు.

ఆయన గత కొంత కాలంగా బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్నారు. ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు నటి విపన థప మీడియాకు తెలిపారు. ప్రదీప్ రావత్ తెలుగు, హిందీ, తమిళ సినిమాలతో దేశవ్యాప్తంగా ఫేమస్ అయ్యారు. తెలుగులో 2004లో వచ్చిన సై సినిమాలో భిక్షు యాదవ్ పాత్రతో చూపించిన విలనిజంతో పాపులర్ అయ్యారు. ఆ సినిమాకు బెస్ట్ విలన్ గా ఫిలింఫేర్ అవార్డు కూడా అందుకున్నారు. ఆ తర్వాత గజినీ, భద్ర, అందరివాడు, ఛత్రపతి, లక్ష్మీ, స్టాలిన్ మొదలైన సినిమాలతో తన విలనిజాన్ని పండించారు. లేటెస్టుగా వాల్తేరు వీరయ్య, గాయపడ్డ సింహం సినిమాల్లో నటించారు.

1952లో జబల్పూర్ లో జన్మించారు. ఆయనకు భార్య కళ్యాణి రావత్, ఇద్దరు కుమారులు విక్రమ్ రావత్, సింగ్ రావత్ లు ఉన్నారు. బీ.ఆర్ చోప్రా తెరకెక్కించిన మహాభారతంలో అశ్వత్థామ పాత్రతో ఆయన వెండితెరకు పరిచయమయ్యారు. ప్రదీప్ రావత్ దాదాపు 80 సినిమాల్లో నటించారు. హిందీలో సర్ఫరోష్, లగాన్, దీవార్, గజినీ సినిమాలతో మంచి పేరు తెచ్చుకున్నారు.

## ఆలస్యం చేస్తే చాలా కష్టం.. జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్.. పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

- మొదటి పేజి తరువాయి

లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు. బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

## విద్యుత్ ఛార్జీలు పెంచలేదు, ట్రూడౌన్ చేశాం

- మొదటి పేజి తరువాయి

సౌర విద్యుత్ ద్వారా లక్షలాది కనెక్షన్లు ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన విద్యుత్ అవసరాలను తీర్చేందుకు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తున్నామని గొట్టిపాటి తెలిపారు. రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని అన్నారు. 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసి, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూనే, తాము చేస్తున్న పనులను వారి దృష్టికి తీసుకెళుతున్నామని గొట్టిపాటి రవికుమార్ వివరించారు.

## అహంకారం వినాశనానికి దారితీస్తుంది

తమిళనాడులో డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్, అనంతరం విడుదల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. ఈ పరిణామంపై ఉదయనిధి తండ్రి, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో స్పందించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే (తమిళగ వెట్రి కళగం) ప్రభుత్వం అహంకారపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. "అహంకారం వినాశనానికి దారితీస్తుంది. అహంభావం మితిమీరితే పతనం మరింత వేగవంతం అవుతుంది" అని ఆయన హెచ్చరించారు. ప్రముఖ నటి త్రిషను ఉద్దేశించి ద్వంద్వార్థాలు వచ్చేలా వ్యాఖ్యానించారన్న ఆరోపణలతో పోలీసులు ఉదయనిధి స్టాలిన్‌ను మంగళవారం అరెస్టు చేశారు. సుమారు నాలుగు గంటలపాటు విచారించిన అనంతరం ఆయనను విడుదల చేశారు. అయితే, తన ప్రసంగంలో ఎలాంటి అసభ్యత లేదని ఉదయనిధి స్పష్టం చేశారు. కావేరి జలాల సాధనలో, మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవడంలో ప్రభుత్వ వైఫల్యాలను తాను ప్రశ్నించినందుకే, కక్షపూరితంగా ఈ చర్యలు తీసుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై స్పందించే ధైర్యం లేక, కావేరి అంశం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ప్రభుత్వం ఉదయనిధిని అరెస్ట్ చేసిందని ఎం.కె. స్టాలిన్ విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ఒక్కరోజు ముందు ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని, ఆయనను సభకు హాజరుకాకుండా అడ్డుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులు, విద్యార్థులు, రైతుల గొంతు నొక్కేందుకు టీవీకే ప్రభుత్వం అరెస్టులను ఒక ఆయుధంగా వాడుకుంటోందని డీఎంకే నేతలు విమర్శలు గుప్పించారు.

# మోడల్ టౌన్‌గా కందుకూరు

**-120 కోట్లతో పట్టణ అభివృద్ధి పనులు -పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ కు అనుగుణంగా ప్రణాళికలు**

**-ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెల్లడి**







**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 4:**

కందుకూరు పట్టణాన్ని మోడల్ టౌన్ గా తీర్చిదిద్దుతానని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా కందుకూరు పట్టణంలోని 16వ వార్డు పరిధిలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం ఉదయం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభ్యుదయ స్కూల్, తేలప్రోలు వారివీధి, గ్రంథాలయం ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఈ రెండేళ్లలో మున్సిపాలిటీ పరిధిలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని, మునిసిపాలిటీలో రోడ్ల విస్తరణ చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇంకా ట్రాఫిక్ నివారణకు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, అన్ని వార్డుల్లో పెద్ద ఎత్తున సిసి రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. మున్సిపాలిటీలో 120 కోట్లతో పనులు జరగడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాయణ సహకారం ఎంతో ఉందన్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపడం ద్వారా వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తాము తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెల్లడించారు. అమృత్ 2.0 పథకం ద్వారా శివారు ప్రాంతాలకు త్రాగు నీటి సరఫరా, మురికి నీటిని వాడుక నీటిగా మార్చే ఎస్టిపి ప్లాంట్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే పురాతన డ్రైనేజీ కాలువల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు 10 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు నాగేశ్వరరావు చెప్పారు. రాబోయే రోజుల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున జరుగుతాయని, మొత్తంగా కందుకూరు పట్టణాన్ని మోడల్ టౌన్ గా మార్చేంతవరకు 24 గంటలు కష్టపడుతూ ముందుకు వెళుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ప్రతి ఇంటికి అందుతున్న సంక్షేమ పథకాలు, ఆరోగ్య ఇబ్బందులు తెలుసుకుంటూ ఎమ్మెల్యే పర్యటన సాగింది. చిరునవ్వులు, పలకరింపులతో సుమారు 50 ఇళ్లకు వెళ్లిన ఆయన ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఎలా ఉన్నారు అని యోగక్షమాలు తెలుసుకుంటూ కూటమి ప్రభుత్వ పాలన గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మున్సిపల్ డిఈ గణపతి, వార్డు అధ్యక్షులు కొత్త నరేంద్ర, ఏఎంసి డైరెక్టర్ కొత్తూరి వెంకట సుధాకర్, మురారిశెట్టి వెంకట సుబ్బారావు, అన్న క్యాంటీన్ సభ్యులు కాకుమాని ప్రవీణ్, కంకణాల వెంకటేశ్వర్లు, ఇస్కాల మధు, ఇన్నమూరి నరసింహం, వాసు, అల్లూరయ్య, చిట్టి, సుబ్బరాయుడు, రామకృష్ణ, తోట సురేష్, పట్టణ మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీను, క్లస్టర్ ఇంచార్జ్ వడ్డెళ్ళ రవిచంద్ర, యూనిట్ ఇంచార్జి కోటపూరి శ్రీను, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర కమిటీ నాయకులు బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, అల్లం వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, నియోజవర్గ కమిటీ నాయకులు కల్లూరి శైలజ, రాయపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

## మార్కాపురం - ప్రకాశం

MARKAPURAM మార్కాపురం

# ఎన్నికల జాతర మొదలవుతుందోచ్...

*రాంబాబు జన్మదినం కాదు.. ఇది ఎన్నికల ప్రచారమే అంటున్న ప్రజలు*

*టీడీపీ ఇంటింటి ప్రచారానికి కౌంటర్ గా.. అన్నా బర్త్ డే వేడుక.*

*జిల్లా సాధన, సంక్షేమం, బ్రామరా వెంచర్ ప్రధాన చర్చాంశాలు*

*స్థానిక సంస్థల ఎన్నికలు టార్గెట్...రాజకీయ వేడి మొదలైంది*





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 4**

ఏపీలో ఎన్నికల జాతర మొదలైపోయినట్టే ఇప్పటికే ఈ ఏడాది చివరిలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది ముందుగా మున్సిపల్ ఆ తర్వాత పరిషత్ చివరగా 2027 జనవరిలో పంచాయతీ ఎన్నికలు జరిపేలా అధికారులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మార్కాపురంలో రాజకీయం వేడెక్కింది. రెండు ప్రధాన పార్టీలు ఇప్పటి నుండే ప్రచార వ్యూహాలను రూపొందిస్తున్నాయి.

**జిల్లా సాధన - సంక్షేమం అస్త్రంగా టీడీపీ..:** ఈ క్రమంలో టీడీపీ నాయకులు “ఇంటింటి ప్రచారం కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక నాయకులు ప్రతి వార్డులోనూ ఇంటింటికి తిరుగుతూ గత రెండేళ్ల పాలనలో చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. పెన్షన్లు, అమ్మ ఒడి, రైతు భరోసా లబ్ధిదారులను కలిస్తున్నారు. ప్రధానంగా మార్కాపురం జిల్లా సాధన వెనుక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కృషి ఉందని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. దీన్నే ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా వాడుకోబోతున్నారు.

**రాంబాబు పుట్టినరోజు వేడుకలతో పరోక్ష ప్రచారం..:** ఇందులో భాగంగానే ఇటీవల అన్న రాంబాబు పుట్టినరోజు వేడుకలను అభిమానులు అత్యంత ఘనంగా నిర్వహించారు. వేలాది మందితో కేక్ కటింగ్, అన్నదానం వంటివి నిర్వహించారు. ఇది జన్మదినం కాదు, ఇది ఎన్నికల ప్రచారమే అని స్థానికుల్లో చర్చ జరుగుతోంది.

**బ్రామర వెంచర్‌తో మొదలైన మాటల యుద్ధం..:** ఎన్నికలు దగ్గరపడుతుండటంతో బ్రామరా వెంచర్ వ్యవహారం చుట్టూ రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలైంది. అభివృద్ధి, అవినీతి, ఆరోపణలు, ప్రతి ఆరోపణలు సోషల్ మీడియా, కార్యకర్తల సమావేశాలలో ప్రధానంగా వినిపిస్తున్నాయి.

**ఎన్నికలకు ముందే పావులు కదుపుతున్న పార్టీలు..:** తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి రెండు పార్టీలు వార్డు స్థాయి సమావేశాలు, యువజన, మహిళా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సంక్షేమ లబ్ధిదారుల జాబితాలతో ఇంటింటి ప్రచారం, సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తున్నాయి.

**ప్రజలు ఏం కోరుతున్నారు? ..:** ఎన్నికల పోటీ చేసేవారు ఎన్నికల ముందు కాకుండా ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకత్వం కావాలి. రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, చెత్త సమస్యలు పరిష్కరించాలి” అనేది సామాన్యుల మాట.

**రాజకీయ విశ్లేషకుల మాట**

ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా ముందస్తు ప్రచారం ఊపందుకుంది. జిల్లా సాధన, సంక్షేమం, బ్రహ్మర వెంచర్ వంటి అంశాలు రాబోయే ఎన్నికల్లో ప్రధానంగా చర్చకు వస్తాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# డీఎస్సీ అక్రమాలపై సిబిఐ ఎంక్వైరీ నిర్వహించాలి

*-విద్యాశాఖ మంత్రి లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి*

*-నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ డిమాండ్*







**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 4:**

బాబు వస్తే జాబు వస్తుందని చిన్నబాబు చెబితే నమ్మి ఓట్లు వేసి మోసపోయిన విద్యార్థి యువతకు చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి అయిన తన కొడుకు చేత రాజీనామా చేయించి 40 సంవత్సరాల ఇండస్ట్రీ నిజాయితీని నిలబెట్టుకోవాలని మాజీ శాసనసభ్యులు ఇంచార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ సవాలు విసిరారు. స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన డీఎస్సీ 2025 లో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ అక్రమ నియమకాలపై సమగ్ర విచారణ జరపాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. డీఎస్సీ 2025లో జరిగిన అక్రమ నియామకాలపై, నిరుద్యోగ యువతకు జరిగిన అన్యాయాన్ని పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకువెళ్తాము అని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేసేవరకు పోరాటం చేస్తామని అన్నారు.యువ గళం పేరుతో యువతను మోసగించిన లోకేష్ పారదర్శకంగా డీఎస్సీని నిర్వహించి ఉంటే డీఎస్సీ కన్వీనర్ ను తొలగించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందంటే సమాధానము చెప్పకుండా తప్పుకుంటున్నారని విమర్శించారు. డీఎస్సీ 2025లో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణకు ఆదేశించి విద్యాశాఖ మంత్రి నిజాయితీని నిరూపించుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. డీఎస్సీ పేపర్ లీకేజీ, స్పోర్ట్స్ కోటా పేరిట అన్యాయాలషనేపథ్యంలో డీఎస్సీలో అక్రమ నియామకాలపై చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగ యువతకు క్షమాపణ చెప్పాల్సిన అవసరం ఉందని, న్యాయ విచారణ చేయించాలని డీఎస్సీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.పేపర్ లీకేజీ నుంచి స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీ వరకు జరిగిన ప్రతి అక్రమంపైన సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాము అని అన్నారు.స్పోర్ట్స్ కేటగిరీలో జూడో 39 పోస్టులు ఇచ్చారు ఈ జూడో కేటగిరీ అధ్యక్షుడిగా విశాఖ ఎంపీ అయినా భరత్ స్వయాన లోకేష్ కి తోడల్లుడు స్పోర్ట్స్ కేటగిరి పోస్టుల భర్తీ గురించి మేము అడిగిన ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వటం లేదో చెప్పాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతిభతో ఉద్యోగాలు సాధించాల్సిన యువతను రోడ్లెక్కించిన పాపం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉన్న కూటమి ప్రభుత్వానిదే టీచర్ ఉద్యోగం కోసం రాత్రింబవళ్లు శ్రమించిన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాల్సిన చంద్రబాబుగారి ప్రభుత్వం... డీఎస్సీలో లీకులు, అక్రమాలతో వారి భవిష్యత్తును కాలరాసింది అని తీవ్రంగా విమర్శించారు.డీఎస్సీ నియామక విషయంలో ప్రభుత్వం ఇప్పటికి కూడా అభ్యర్థులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు ఎందుకు చెప్పటం లేదు అని నిలదీశారు.మెరిట్ లిస్టులను పలుమార్లు ఎందుకు మార్చాల్సి వచ్చిందో విద్యా శాఖ మంత్రి సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.సెలెక్ట్ చేసిన అభ్యర్థుల జాబితాను జిల్లా కలెక్టర్ కార్యాలయాలు వద్ద ఎందుకు బహిరంగంగా ప్రదర్శించలేదు సమాధానం చెప్పలేక పోతున్నారని అన్నారు.సాక్ష్యాలు, ఆధారాలు కళ్ల ఎదుటే కనిపిస్తా ఉన్నా సీఎం చంద్రబాబు కానీ, విద్యాశాఖమంత్రి లోకేష్ కానీ ఇప్పటివరకూ వాటిమీద నోరుమెదపటం లేదు ఎందుకు అని ప్రశ్నించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు బకాయి ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి నిధులను విడుదల చేయాలి అని డిమాండ్ చేశారు.నిరుద్యోగ యువకులకు ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చినట్లుగా నిరుద్యోగ భృతిని నెలకు 3000 ఇవ్వాలి అని ఈ సమావేశంలో కోరారు. నిరుద్యోగయువత డిమాండ్లను సాధించే క్రమంలో యువత, విద్యార్థుల భాగస్వామ్యంతో మరిన్ని రూపాల్లో ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రస్థాయికి తీసుకెళ్తాం అని దానిలో భాగంగా ఈరోజు పార్టీ కార్యాలయంలో జరిగే సదస్సుతో డీఎస్సీ అక్రమాలపై గళమెత్తుతున్నాం .అలాగే ఈనెల 6,7,8,9 తారీకులలో కందుకూరు సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నాము అని అన్నారు. 10 వ తేదీ విద్యార్థి యువతతో కలిపి భారీ ఎత్తున డీఎస్సీలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామని స్థానిక పార్టీ కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది అని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో విద్యావేత్తలు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు,డీఎస్సీ అభ్యర్థులు,నిరుద్యోగ యువత, విద్యార్థులు, పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, కందుకూరు మండల అధ్యక్షులు ఈదర రమేష్, లింగసముద్రం మండల అధ్యక్షులు నోటి వెంకటేశ్వర రెడ్డి, ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు, పార్టీ నాయకులు తోకల కొండయ్య, చీమల వెంకట రాజా, గణేశం గంగిరెడ్డి, ఉప్పుటూరి నాగేశ్వరరావు, వంకాయలపాటి వెంకటేశ్వర్లు, ముప్పవరపు కిషోర్, బద్దిపూడి జయరావు, రావులకొల్లు బ్రహ్మానందం, వల్లూరి కోటేశ్వరరావు, రమేష్, బిల్లా రమణయ్య, పాశం కొండయ్య, మద్దసాని నవీన్ యాదవ్, పాలవల్లి అమర్నాథ్ రెడ్డి, ఉచ్చులూరి రవీంద్ర, పల్నాటి చెన్నయ్య, చింతలపూడి సుధాకర్, తుళ్లూరి ఆదిలక్ష్మి, కే వసంత, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు సద్వినియోగంపై సదస్సులు నిర్వహించాలి

**- జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్ సూర్యకుమారి ఆదేశం**

**- అర్హులైన ఓటర్లకు మాత్రమే ఎన్నికల జాబితాలో స్థానం జిల్లా కలెక్టర్ రాజాబాబు**





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 04**

జిల్లా వ్యాప్తంగా 'స్వీప్' ఓటరు అవగాహన కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్ సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నందు మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రకాశం జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్ ఎ. సూర్యకుమారి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి. రాజా బాబుతో పాటు పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా రోల్ అబ్జర్వర్ ఎ. సూర్యకుమారి మాట్లాడుతూ రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఎంతో కీలకమైనదని, ఓటు ప్రాముఖ్యతను ప్రజలకు స్పష్టంగా తెలియజేసేలా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, డిగ్రీ, నర్సింగ్ కళాశాలల్లో యువతను భాగస్వాములను చేస్తూ ఈ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. 18 నుండి 19 సంవత్సరాల వయస్సు గల యువ ఓటర్ల నమోదును పెంచడంతో పాటు, 17 సంవత్సరాలు పూర్తయిన భవిష్యత్ ఓటర్ల వివరాలను కూడా ముందస్తుగా ఎంట్రీ చేయించాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడంపై జిల్లా ఎన్నికల అధికారి, మునిసిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూర్యకుమారి స్పష్టం చేశారు. సమాజంలో అత్యధిక సార్లు ఓటు వేసిన పాత తరం / సీనియర్ ఓటర్లను 'స్వీప్' కార్యక్రమాలకు ఆహ్వానించి, వారి అనుభవాల ద్వారా కొత్త ఓటర్లలో అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా రాజ్యాంగ విరుద్ధంగా ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉండకూడదని, మ్యాపింగ్ విఫలమైన ప్రాంతాలపై ఎక్కువ దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో అత్యుత్తమంగా పనిచేసిన బూత్ స్థాయి అధికారులను గుర్తింపుగా సత్కరించాలని, వారి వివరాలను సర్వీస్ రికార్డులలో కూడా నమోదు చేయాలని సూచించారు. ?జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రస్తుతం 90.92 శాతం (12,71,977) పూర్తి అయిందని వెల్లడించారు. మిగిలిన 9.08 శాతం డేటాలో మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, ద్వంద్వ ఓటర్లు (డబుల్ ఎంట్రీలు) కలిపి మొత్తం 1,27,029 కేసులు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా మ్యాపింగ్ లోపాలు, సరిదిద్దుబాట్లు, అందుబాటులో లేని వారు (ఆబ్సెంట్) మొత్తం 1,96,341 మంది ఉన్నారని, వీరందరికీ నోటీసులు జారీ చేసి, ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లచే క్షేత్రస్థాయి విచారణ చేపట్టి కేవలం అర్హులైన వారిని మాత్రమే ఓటర్ల జాబితాలో కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి స్పీకింగ్ ఆర్డర్ జారీ చేస్తూ పారదర్శకంగా తొలగింపులు, చేర్పులు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే జూలై 31, 2026 నాటికి ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు మరియు రాజకీయ పార్టీల సౌకర్యార్థం ఎ.ఎస్.డి.డి (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డ్యూప్లికేట్) జాబితాను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని, ఎవరైనా సరిచూసుకోవచ్చని పేర్కొన్నారు.

జిల్లాలో నిర్వహించిన ఓటర్ల సమగ్ర పరిశీలన కార్యక్రమం ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా జరిగిందని సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. ?ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు మరియు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషణ

**- తల్లిపాల వారోత్సవాల్లో అవగాహన**




**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 4**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సీడీపీఓ ఉషారాణి ఆదేశాల మేరకు కందుకూరు పట్టణంలోని సచివాలయం-2, సచివాలయం-3 పరిధిలోని ఖాదీ ఆఫీస్ ఏరియా అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని సూపర్వైజర్ యు. ప్రభావతి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. శిశువు జన్మించిన గంటలోపే ముర్రిపాలు పట్టించడం అత్యంత అవసరమని, బిడ్డకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు తల్లిపాలనే పూర్తిస్థాయి ఆహారంగా ఇవ్వాలని సూచించారు. ఉద్యోగాలకు వెళ్లే తల్లులు కూడా తప్పనిసరిగా ఆరు నెలల పాటు తల్లిపాలు అందించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని ప్రోత్సహించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తి సమృద్ధిగా లభించడమే కాకుండా, తల్లుల్లో భవిష్యత్తులో బ్రెస్ట్ క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని వివరించారు. అలాగే తల్లి--బిడ్డల మధ్య భావోద్వేగ అనుబంధం మరింత బలపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జరీనా, దివ్య, ఆదిలక్ష్మి, కోటేశ్వరమ్మ, ధనలక్ష్మి, కరీమా తదితరులు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన గర్భిణులు, బాలింతలు, తల్లులు పెద్ద సంఖ్యలో హాజరై తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పొందారు.

## ఉప రాష్ట్రపతితో టీడీపీ ఎంపీల మర్యాదపూర్వక భేటీ

**- అమరావతి ప్రాముఖ్యతను తెలిపే పుస్తకం బహూకరణ**



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 04**

భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, నరసరావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఇతర టిడిపి పార్లమెంట్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్లమెంటు సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం అమరావతికి సంబంధించిన దార్శనికత, పురోగతి, ప్రాముఖ్యతను వివరించే పుస్తకాన్ని వారికి అందజేశారు.

## ఆంధ్ర కేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి హరిబాబుకు అరుదైన గౌరవం -రాయల్ సొసైటీ వారి ఎఫ్ ఆర్ ఎస్సీ కి హరిబాబు ఎంపిక

**హరిబాబును ఘనంగా సత్కరించిన ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు**



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 04**

అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ (ఏపీఎల్టీ) ఆధ్వర్యంలో ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డా. బి. హరిబాబుని, యునైటెడ్ కింగ్డమ్లోని రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (ఆర్ఎస్సి) ప్రదానం చేసే ప్రతిష్ఠాత్మక ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ( ఎఫ్ ఆర్ ఎస్సీ) గౌరవానికి ఎంపికైన సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపిఎల్టి ప్రతినిధులు ప్రొ. డా. బి. హరిబాబు కి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. విద్యా, పరిశోధన రంగాల్లో ఆయన సాధించిన విశిష్ట విజయాలు విశ్వవిద్యాలయానికి, రాష్ట్రానికి గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపిఎల్టి సభ్యులు రామస్వామి, సాయి రాజేష్, బ్రహ్మయ్య, మహేశ్చారి, జాన్, మురళి పాల్గొన్నారు.

## ఏపీ అంచనాల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల

**నీటిపారుదల, గనులు, విద్యుత్ శాఖలపై చర్చ**

**మార్కాపురం, పెన్ పవర్ ఆగస్టు 4**

ఎమ్మెల్యే, ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు కందుల నారాయణరెడ్డి మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని ఏపీ అసెంబ్లీలో జరిగిన అంచనాల కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల, గనులు, విద్యుత్ తదితర కీలక శాఖల అంశాలపై లోతుగా చర్చ జరిగింది. కమిటీ సభ్యులు సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ప్రభుత్వ ప్రాజెక్టుల అంచనాలు, నిధుల వినియోగం, పనుల పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో అంచనాల కమిటీ సభ్యులందరూ పాల్గొని, ప్రజా ధనం సద్వినియోగం, పారదర్శకత, పనుల నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా కమిటీ పలు సూచనలు చేసింది.



# అభివృద్ధితోపాటు ఆరోగ్య సంక్షేమం కూడా ముఖ్యమే

**-వైద్యసహాయాలు అందించడంలో ముందున్నాం -ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెల్లడి**

**-42వసారి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే -57 మందికి 34, 79,775 రూపాయల వైద్యసహాయం**

**కందుకూరు పెన్ పవర్,, ఆగస్టు 4**

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు వైద్య సహాయాలు అందించడంలో రాష్ట్రస్థాయిలో ముందు వరుసలో ఉన్నామని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం కందుకూరులోని టిడిపి కార్యాలయంలో 42 విడతగా57 మంది లబ్ధిదారులకు 34, 79, 775 రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కందుకూరు అర్బన్ పరిధిలో తొమ్మిది మందికి 3,39,780 రూపాయలు, కందుకూరు రూరల్ పరిధిలో 7 మందికి 4,09,652 రూపాయలు, గుడ్లూరు మండలంలో 5 మంది 2,42,250 రూపాయలు, లింగసముద్రం మండలంలో 9 మందికి 5,90,251 రూపాయలు, ఉలవపాడు మండలంలో 10 మందికి 3,78,250 రూపాయలు, వలేటివారిపాలెం మండలంలో 11 మందికి 4,66,022 రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. అలాగే ఆరుగురికి తక్షణ వైద్యం కోసం 10, 53,580 రూపాయల విలువైన చెక్కులను చేతికి అందించారు. కందుకూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,677 మందికి 12.87 కోట్లు మంజూరు చేయించామని




నాగేశ్వరరావు తెలిపారు. అడిగిందే తడువుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సహాయాలు చేస్తున్నారని, లబ్ధిదారులు కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని గ్రహించి, అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు,



పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, షేక్ సలాం, చదలవాడ కొండయ్య, వడ్డేళ్ళ రవిచంద్ర, పొడపాటి మహేష్, రాయపాటి శ్రీను, చుండూరి శ్రీను, ముప్పవరపు వేణు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై విమర్శలా ?

**-ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు -ప్రజల్ని తప్పుదోవ పట్టించడమే వైసీపీ పని**

**-యువతకు ఉద్యోగాలు ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం -లోకేష్ పనితీరుపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉంది**

**మీడియా సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు**



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 4:**

కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో, శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూస్వర్గీయ ఎన్టీఆర్ పాలనలో 3 సార్లు, చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వాల హయాంలో 9 సార్లు, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఒకసారి డీఎస్సీ నిర్వహించారు. సుమారు 1.75 లక్షల మందికి ఉపాధ్యాయులుగా అవకాశం కల్పించారు. అర్హులైన అభ్యర్థులందరికీ న్యాయం జరిగేలా, ప్రతిసారి పారదర్శకంగా టీచర్ల నియామకం జరిగింది. నోటిఫికేషన్ మొదలుకుని నియామకాల వరకు అన్ని వివరాలు ఆన్ లైన్ లో ఉన్నాయి. అవకతవకలకు ఆస్కారమే లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలన్నీ భర్తీ చేసి, యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని మంత్రి లోకేష్ ధృడసంకల్పంతో ఉన్నారు. మంచిని అడ్డుకోవడమే జగన్ పని. ఉద్యోగాలు రానివ్వకుండా కోర్టులో కేసులు వేయించారు. ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతో తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారు. చివరకు ఉద్యోగాలు పొందిన వారి మనోభావాలు దెబ్బతినేలా వైసిపి నేతలు దారుణంగా మాట్లాడుతున్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అని ఊదరగొట్టిన జగన్... ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు ? ప్రజల్ని రెచ్చగొట్టడం తప్ప ఆయన చేసిందేమీలేదు ? వైసీపీ పాలనలో ఉపాధ్యాయులు ఎన్ని ఇబ్బందులు పడ్డారో అందరికీ తెలుసు. డీఎస్సీ నియామకాలపై ఎవరైనా, ఎప్పుడైనా చర్చకు రావొచ్చు. మేము సిద్ధమే. లోకేష్ నాయకత్వం, పనితీరుపై ప్రజలకు పూర్తిస్థాయిలో నమ్మకం ఉంది. జగన్ ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా ప్రజలు నమ్మరని గుర్తుంచుకోవాలి అని అన్నారు. మంత్రి నారా లోకేష్ నియోజకవర్గం మంగళగిరిలో నిడమర్రు హైస్కూల్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకొని మోడల్ గా తీర్చిదిద్దారు. అదే స్థాయిలో అభివృద్ధి చేయడానికి కందుకూరులోని బాలుర హై స్కూల్ ఎంపిక చేసినందుకు లోకేష్ కి కృతజ్ఞతలు అన్నారు. కోట్లాది రూపాయలతో పాఠశాల రూపురేఖలు మారబోతున్నందుకు సంతోషంగా ఉంది అని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమిట్ల గురునాథం, జనిగర్ల నాగరాజు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, క్లస్టర్ ఇంచార్జ్ వడ్డేళ్ల రవిచంద్ర, రాయపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే అమృతం..

**డబ్బాపాల కంటే తల్లిపాలే ఉత్తమం -సూపర్వైజర్ కే.వి. సుబ్బమ్మ**

**పుల్లల చెరువు పెన్ పవర్ ఆగస్టు 4**

పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలే తొలి టీకా అని, తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ పోషకాహారంతో పాటు రోగనిరోధక శక్తిని అందించే అమృతమని సూపర్వైజర్ కే.వి. సుబ్బమ్మ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం పుల్లల చెరువు మండల కేంద్రంలోని ఎస్టీ-2 అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సుబ్బమ్మ మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ఎంతో అవసరమని, పుట్టిన తొలి ఆరు నెలలు ఎలాంటి నీరు, ఇతర ఆహారం ఇవ్వకుండా పూర్తిగా తల్లిపాలే అందించాలని సూచించారు. అనంతరం రెండేళ్ల వయస్సు వరకు అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలను కొనసాగిస్తే పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగ్గా ఉంటుందని తెలిపారు.ప్రసవం అనంతరం వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) శిశువుకు సహజ రక్షణ కవచంలా పనిచేస్తాయని, వాటిలో ఉండే పోషకాలు, ప్రతిరక్షకాలు ఇన్ఫెక్షన్లు, అలర్జీలు, శ్వాసకోశ సమస్యలు, విరేచనాలు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడతాయని వివరించారు.తల్లిపాలు తాగే పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగి అస్తమా, మధుమేహం, పోషకాహార లోపం వంటి సమస్యలు వచ్చే అవకాశాలు తగ్గుతాయని అన్నారు.డబ్బాపాలు, పోతపాలపై ఆధారపడడం వల్ల చిన్నారులు తరచూ అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుందని, సాధ్యమైనంత వరకు ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలనే అందించాలని ఆమె సూచించారు.తల్లిపాలు ఇవ్వడం



వల్ల బిడ్డకే కాకుండా తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని సుబ్బమ్మ తెలిపారు. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, మధుమేహం, అధిక రక్తపోటు వంటి వ్యాధుల ముప్పు తగ్గడంతో పాటు ప్రసవానంతర ఒత్తిడి, ఆందోళన కూడా తగ్గుతాయని చెప్పారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల శరీరంలో అదనపు క్యాలరీలు ఖర్చై తల్లి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని వివరించారు.ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలే పునాది అని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు బేబీ రాణి, సోమ లత, నాగ కుమారి, పద్మ బాయ్, లక్ష్మి దేవి, సుజాత, హెప్సీ రాణి, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

## పంటల భీమా నమోదు గడువు ఆగస్టు 15 వరకు పొడిగింపు

***మండల వ్యవసాయాధికారి పి మధుబాబు***



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 4**

పంటల భీమా నమోదు గడువును ఆగస్టు 15 వరకు ప్రభుత్వం పొడగించడం జరిగిందని, ఎల్నినో ప్రభావం వలన వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందువలన పంటలు వేసిన రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బంది ని సంప్రదించి పంట నమోదు మరియు పంటల భీమా పథకాలను ఉపయోగించు కోవలెనని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు తెలిపారు మంగళవారం మండలంలోని ముండ్లపాడు , దర్శితిమ్మక్కపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో యూరియా మరియు డిఏపి ఎరువులు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు ఉపయోగించుకోవాలన్నారు ఈ ఖరీఫ్ సీజన్లో వరి, కంది, సజ్జ, ఎండు మిరప, మినుము సాగు చేసే రైతులు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో నమోదయ్యేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ప్రీమియం చెల్లించి భీమా పొందవచ్చన్నారు. పంటలు సాగులో ఉన్న అన్ని గ్రామాల పరిధిలోని రైతు సేవ కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉంచి, ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి , గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా ఎరువుల కొరత ఉండదు

**టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు**



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగస్టు 4**

రైతులకు ఎక్కడ కూడా యూరియా ఎరువుల కొరతవుండదని ప్రభుత్వం ఆపాయిమ్స్ యాప్ ను ప్రవేశపెట్టిందని నియోజకవర్గం ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు.మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గ స్థాయిలోని రైతు సేవా కేంద్ర సిబ్బందికి ఎర్రగొండపాలెం ఈ పోస్ మెషిన్లను పంపిణీ చేశారు చేశారు. యూరియా మరియు డి ఏ పి ఎరువులను పంట సాగు చేసే ప్రతి ఒక్క రైతుకు అందే విధంగా ఎరువుల యొక్క దుర్వినియోగం అరికట్టడమే ఈ యాప్ యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఆన్లైన్లో ఉన్న ప్రతి రైతుకు వారు వేసే పంటను బట్టి ఓటిపి ద్వారా రైతులకు ఎరువుల సరఫరా చేయడం జరుగుతుందని,. ఆన్లైన్లో లేని కౌలు రైతులు, ఈ నామ్ రైతులు, నాన్ వెబ్ ల్యాండ్ రైతులకు కూడా సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా యాప్ లో నమోదు చేసి ఎరువులను పంపిణీ చేయవచ్చు అని తెలిపారు. దీని ద్వారా పంట అవసరాలకు అనుగుణంగా మాత్రమే ఎరువులను తీసుకోవచ్చు. విచ్చలవిడి ఎరువుల వాడకం తగ్గించి భూసారాన్ని పెంచవచ్చు అని తెలిపారు. రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగొండపాలెం సహాయ వ్యవసాయ సంచాలకులు ఈ. వెంకటరమణ, ఎర్రగొండపాలెం మండల అధ్యక్షులు చిట్యాల వెంగల్ రెడ్డి, పుల్లలచెరువు మండల అధ్యక్షులు పోట్ల గోవింద్, నియోజకవర్గ స్థాయిలోని మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది, మండల నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

## క్రీడల్లో సత్తా చాటిన సి ఎస్ పురం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

**విజేతలను అభినందించిన హెచ్ఎం షేక్ ఖాదరున్నీసాబేగం**




**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 4**

కనిగిరి నియోజకవర్గ స్థాయి అమరావతి ఛాంపియన్షిప్ అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం కంచర్లవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో సి.ఎస్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు లాంగ్ జంప్ విభాగంలో ఎ. చందు ప్రథమ స్థానం సాధించి తన ప్రతిభను చాటగా, 800 మీటర్ల పరుగు పందెంలో ఎం. సూర్య తృతీయ స్థానం కైవసం చేసుకున్నాడు. షాట్పుట్ పోటీల్లో షేక్ మహమ్మద్ అమన్ తృతీయ స్థానంలో నిలిచాడు. 100 మీటర్ల పరుగు పందెంలో ఎ. చందు తృతీయ స్థానం సాధించారు విజేతలైన విద్యార్థులను మరియు పిడి ఎన్. శ్రీనివాసులు ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసాబేగం అభినందించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిడి శ్రీనివాసులు కృషి, క్రమశిక్షణే ఈ విజయాలకు కారణమని కొనియాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు విద్యార్థుల విజయంతో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# డీఎస్సీ-2025 బాధితులకు అండగా నిలుద్దాం

## 20 లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది? -ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చెయ్యాలి

## కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆరోపణలు



**మార్కాపురం రూరల్ పెన్ పవర్ ఆగస్టు 4**

కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025లో అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబులి ఆరోపించారు. ఉద్యోగ ఎంపిక పరీక్షలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి డీఎస్సీ రాయడం, అందులో ర్యాంక్ సాధించడం, అనంతరం ఇంటర్వ్యూకు పిలవకపోవడం, అతడు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం వంటి పరిణామాలు చూస్తే ప్రక్రియలో అక్రమాలు జరిగాయనే అనుమానాలు వస్తున్నాయని ఆయన అన్నారు.



**స్పోర్ట్స్ కోటా ఎంపికపై విమర్శలు..**

స్పోర్ట్స్ కోటా ఎంపికలో నిజమైన లబ్ధిదారులకు బదులుగా అనర్హులకు, ఆటలు రానివారికి, అవకాశాలు దక్కాయని అన్నా రాంబాబు విమర్శించారు. ఇది అర్హులైన క్రీడాకారులకు చేసిన అన్యాయమన్నారు.

**ఉద్యోగ, విద్యారంగంపై ప్రభుత్వ వైఫల్యం..**

20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఏమీ ఇవ్వకుండా నిరుద్యోగులను ముంచేసిందని ఆయన ఆరోపించారు. అలాగే కళాశాలల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయని తెలిపారు.

**బాధితులకు అండగా వైసీపీ..**

ప్రభుత్వ వైఖరితో మోసపోయిన బాధిత వర్గాలకు వైఎస్సార్సీపీ, పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి అండగా ఉన్నారు. అదే స్ఫూర్తితో స్థానికంగా పార్టీ నాయకులు, శ్రేణులు బాధితులకు తోడుగా నిలిచి పోరాటం చేయాల్సి ఉంది" అని అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్నా హనుమారెడ్డి,కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస్ రెడ్డి, కొండేపి నియోజకవర్గ పరిశీలకులు షంషీర్ అలీబెగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చిల్లంచర్ల బాలమురళీకృష్ణ, మార్కాపురం తర్లుపాడు పార్టీ అధ్యక్షులు మురారి వెంకటేశ్వర్లు,పోరెడ్డి. చెంచిరెడ్డి, పట్టణ అధ్యక్షులు షేక్ సలీం, మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలి

## మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 4**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలని మండల వ్యవసాయ అధికారి దేవి రెడ్డి శ్రీనివాసులురెడ్డి కోరారు. మంగళవారం నాడు మండలంలోని తలమల్ల, ఉప్పలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశం జరిపారు. అలాగే పంటలను సాగు చేసే పద్ధతులతో పాటు పంటల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ప్రధానమంత్రి పంటల భీమా పథకాన్ని అర్హులైన రైతులందరూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పగుంట, చౌటపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది



**పొన్నలూరు పెన్ పవర్ ఆగస్టు 4**

మండలంలోని విప్పగుంట చౌటపాలెం గ్రామాలలో మంగళవారం వ్యవసాయ అధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా సింగరాయకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు ఇ నిర్మలా కుమారి మాట్లాడుతూ ఎల్ ని నో ప్రభావం వలన వర్షాలు తగ్గటం వలన తక్కువ కాలపరిమితి గల పంటలు వేసుకోవాలని పంట మార్పిడి చేసుకొని జొన్న,రాగి, సజ్జ మొదలగు ఆరుతడి పంటలు వేసుకోవాలని తెలిపారు. ఖరీఫ్ సీజన్ 2026 కి సంబంధించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంట రుణాలు పొందని రైతులు వాతావరణ ఆధారిత పంటలకు మీసేవ కేంద్రాలలో ఆధార్ కార్డు పట్టాదారు పాసుపుస్తకం బ్యాంకు పాసుపుస్తకంతో బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి కోటేశ్వరరావు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ధనలక్ష్మి కవిత భారతి ప్రియాంక సుప్రజ నాగరాజు పొన్నలూరు పిఎసిఎస్ అధ్యక్షుడు ఉన్నం కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు గురుకుల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి పోటీలకు ఎంపిక



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగస్ట్ 4**

మిల్లంపల్లి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి,రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 9వ తరగతి విద్యార్థి ఏ. సాంబశివరావు 600 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించగ,10వ తరగతి విద్యార్థి పి. మల్లికార్జున పెంటాథ్లాన్ విభాగంలో ద్వితీయ స్థానం దక్కించుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 10వ తరగతి విద్యార్థి ఏ. లక్ష్మీనారాయణ డిస్కస్ త్రో విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొందాడు. ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఈ ముగ్గురు విద్యార్థులు,ఈ నెల 13న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పెద్దిరాజు విద్యార్థులను అభినందించారు. క్రీడాకారులను తీర్చిదిద్దిన పీడీ ఆర్. బ్రహ్మ నాయక్, పీఈటీ సీహెచ్. చిన్న లక్ష్మయ్యలను అభినందిస్తూ, భవిష్యత్తులో విద్యార్థులను ఇలాంటి క్రీడాకారులుగా తీర్చిదిద్ది పోటీలకు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ. సలాం ఖాన్, కోచ్ డి. రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరు పోలేరమ్మ దేవస్థానం ధర్మకర్తగా మట్టం శ్రీనివాసులు

**జనసేన నేత ఇమ్మడి కాశీనాథ్ ను సన్మానించిన సగర ఉప్పర సంఘం**

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 4**

మార్కాపురం గ్రామ దేవత అల్లూరు పోలేరమ్మ దేవస్థానం ధర్మకర్తలిగా జనసేన పార్టీకి చెందిన మట్టం శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ అవకాశం కల్పించినందుకు జనసేన నియోజకవర్గ ఇంచార్జి ఇమ్మడి కాశీనాథ్ కు మట్టం శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కాపురం సగర ఉప్పర సంఘం ఆధ్వర్యంలో జనసేన పార్టీ కార్యాలయంలో ఇమ్మడి కాశీనాథ్ ను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు.దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తానని, భక్తులకు మెరుగైన సేవలు అందిస్తానని ఈ సందర్భంగా మట్టం శ్రీనివాసులు తెలిపారు.



# ఆదిత్య కళాశాలలో ఘనంగా కరుణశ్రీ జయంతి వేడుకలు

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 04**

సమాజం పురోభివృద్ధి చెందడానికి సాహిత్యం ప్రధాన పాత్ర పోషిస్తుందని, ఎందరో కవులు, రచయితలు తమ రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించారని,అటువంటి గొప్ప కవులలో జంధ్యాల పాపయ్య శాస్త్రి ఒకరిని , ఆయన రచనల్లో సమకాలీన ధోరణి, సులభమైన శైలి కనిపిస్తాయని, ఆయన కరుణార్ధ్ర కవిత్వపు మానవతా పరిమళం అని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సురేష్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఒంగోలులోని ఆదిత్య డిగ్రీ కాలేజీ ఆవరణలో జరిగిన కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి 113 జయంతి సందర్భం గా ఆయన మాట్లాడారు.సభకు కళాశాల తెలుగు లెక్చరర్ డా. నూనె అంకమ్మరావు అధ్యక్ష వహించి మాట్లాడుతూ కవిత్వం ఒక కమ్మని అనుభూతియని, మానవత్వంలో నవత్వం చూపించే అందాల ఆశాజ్యోతియని, అది జీవిత విపంచి మేళవించి మ్రోగించిన కళ్యాణ గాంధర్వగీతియని చెబుతూ అది ఎదలో మెదుల్తుందని,పాదంలో కదుల్తుందని-హృదయాన్ని స్పృశిస్తూ, ఉదయాన్ని సృజిస్తుందని, అభ్యుదయాన్ని అందిస్తుందని , అందుకే కవిత్వం సత్య సనాతనం -నిత్య నూతనం కావాలని కరుణశ్రీ ఆశించారని,ఆయన మహిళల్ని భోగ వస్తువుగా, మానవ సేవాయంత్రంగా, బానిసగా,హేయంగా చూసే వ్యవస్థను ఈసడించుకున్నారని తెలిపారు. మరొక అతిథిగా పాల్గొన్న కళాశాల సీనియర్ అధ్యాపకులు, యన్. ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.పి.శ్రీనివాసులు మాట్లాడుతూ కరుణశ్రీ ప్రస్తావన వచ్చిన ప్రతిసారీ తెలుగువారి మనసు పులకించి పోతుందని, ఆయన రాసిన



"పుష్పవిలాపం" పద్యాలను ఘంటసాల వారి కంఠంలో విన్నంత సేపూ ప్రతి ఒక్కరం పరవశించి పోతామని తెలిపారు.తదుపరి అందరూ కలిసి కరుణశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా తెలుగు సాహితీ రంగాన చెరగని సంతకంగా మిగిలిన జంధ్యాల పాపయ్య శాస్త్రి చూపించిన దారిలో నడుస్తూ సమత, మమత, కరుణ, ఆర్ధ్రతలను పెంపొందించు కుందామని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన, ఘనమైన నివాళియని అందరూ ముక్త కంఠంతో తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.కోటేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలి

**ఆగస్టు 15లోగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి - ఏఓ సైదా**





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 4**

సంతమాగులూరు మండలంలోని తంగేడుమల్లి, మినెకల్లు గ్రామాల్లో మంగళవారం "పొలం పిలుస్తుంది" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి షేక్ సైదా రైతులతో మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉన్నందున వరి సాగుకు బదులుగా కంది, మినుములు, పెసర వంటి పప్పుధాన్యాల సాగు చేపట్టడం లాభదాయకమని సూచించారు.రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న పంటల బీమా (క్రాప్ ఇన్సూరెన్స్) నమోదు గడువు ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే ఉందని తెలిపారు. అర్హులైన రైతులందరూ గడువులోపు నమోదు చేసుకుని పంటలకు బీమా రక్షణ పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (వీఏఏలు) వెంకటేశ్వర్లు, రమేష్, వీఆర్వో వాసు, ఏహెచ్‌ఏ మొహమ్మద్ అలీతో పాటు గ్రామాల రైతులు పాల్గొని పంటల నిర్వహణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పొందారు.

# ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం క్రింద నమోదుకు ఆగస్టు 15 వరకు పొడిగించించారు

## రైతులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలి

## మండల వ్యవసాయ్యధికారి విజయ భాస్కర్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 4**

గిద్దలూరు మండలం లో వెంగళ రెడ్డి పల్లి , వెల్లుపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్ 2026-27 సీజన్ లో ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద నమోదు చేసుకొనుటకు ఆగస్టు 15. వరకు సమయం పొడిగించారని. ఈ పథకం లో వరి, కంది, సజ్జ, నువ్వులు, మినుములు , ఎండు మిరప మొదలైన పంటలు పంటల బీమా పథకం కింద వర్తిస్థాయని తెలిపారు. పంటలు భీమా చేయదల్చిన వారు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు, పంట ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబర్ మొదలైనవి తీసుకొని దగ్గర లోని మీ-సేవ,సెంటర్, బ్యాంక్ లు మొదలైన చోట పంట భీమా కి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పై పంటలు వేసిన రైతులు తప్పనిసరిగా పంట భీమా కి నమోదు చేసుకోవాలని, ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో పంటలు భీమా కి నమోదు చేసుకున్న యెడల మాత్రమే పంటలు దెబ్బతిన్న కూడా ఆందోళన చెందకుండా ఉండవచ్చని సూచించారు. అతివృష్టి , అనావృష్టి సంభవించినప్పుడు సాధారణంగా పంటల దెబ్బతింటాయి కావున ఆ సమయంలో పంటల బీమా పథకం రైతులకు బాగా ఉపయోగపడుతుందని తెలియజేశారు. ప్రస్తుతం పత్తి పంటలో పూత/గూడు ఎక్కువగా రాలుతుంది. ముఖ్యంగా వాతావరణం లో ఉష్ణోగ్రతలలో మార్పు వలన , తామరపురుగు ఉధృతి ఎక్కువగా ఉండటం వలన పూత ఎక్కువగా రాలుతుందిని నివారణ కు ఎకరాకి 1.5 కేజీ ఎన్:పి: కె 13:0:45,300-400 గ్రాములు బోరాన్,200 గ్రాములు పిప్రోనిల్ 40 ం ఇమిడాక్లోప్రిడ్ 40 డబ్ల్యూ జి పిచికారీ చేసుకున్న యెడల సమర్ధవంతంగా అరికట్టవచ్చు. గ్రామ సభ అనంతరం గ్రామంలోని ఆముదం పంటల క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ఆ పంటలలో వచ్చు చీడ పీడలు , వాటి నివారణ చర్యలు రైతుల కు తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీనివాస రెడ్డి,గ్రామ వ్యవసాయ సహాయకులు నబి యునస్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాగిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

# అన్నా రాంబాబును సన్మానించిన రాష్ట్ర మున్సిపాలిటీ వింగ్ జనరల్ సెక్రటరీ



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు4**

రాష్ట్ర మున్సిపాలిటీ వింగ్ జనరల్ సెక్రటరీ మొగలు సిరాజ్ తుల్లా బేగ్ మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిరాజ్ తుల్లా బేగ్ మాట్లాడుతూ, అన్నా రాంబాబు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి పార్టీని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అన్నా రాంబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే పార్టీ ప్రధాన లక్ష్యమని అన్నారు. పార్టీ శ్రేణులు ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొత్త కృష్ణ, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఖుషిద్, నజీర్, సర్దార్, పోస్టల్ సుభాని, మస్తాన్ వలీ, రామడుగు రమేష్, సీనియర్ నాయకులు సీఎం కాశీం, మార్కాపురం టౌన్ సోషల్ మీడియా అధ్యక్షులు షేక్ మహమ్మద్ రఫీ, గుర్రం వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, సాయి ఎక్స్ ఆర్మీ, శీను, శంకర్ రెడ్డి, ఇమ్రాన్ అలీ బేగ్, దేవరాజు గట్టు, మాజీ ఎంపీటీసీ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశం

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 04**

భూములు రి- సర్వే ప్రక్రియను ఎన్ని మండలాలు పూర్తి చేశారు వివరాలు అడిగి తెలుసుకున్నారు.. మిగిలిన మండలాల్లో రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్.ఓ.ఆర్, అసైన్మెంట్స్, రీ సర్వే, పట్టాదారు పాస్ పుసకాల పంపిణీ, ఎల్నినో ప్రబావం పై జిల్లాల వారీగా సమీక్షించారు. ఒంగోలు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పి.రాజా బాబు పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. గ్రీవెన్స్ అర్జీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కలెక్టరేట్ నుంచి సంబంధిత ఆర్డీవోలు / సబ్ కలెక్టర్ కార్యాలయానికి అర్జీలను పంపించాలని ఆదేశించారు. అదేవిధంగా ఆర్ ఓ ఆర్ సమస్యల పైన దృష్టి సారించి పరిష్కరించాలని తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో పురోగతి పెరిగేలా చర్యలు తీసుకోవాలనీ ఆయన స్పష్టం చేశారు. పి.జి.ఆర్. యస్.కి సంబంధించి వచ్చిన అర్జీలను పరిశీలించి రెవిన్యూ, భూ



సమస్యలు, ఫ్యామిలీ సంబందిత సమస్యలు లాంటివి విడి విడిగా చేసి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవరమైన చర్యలు తీసుకోవాలని, అదే విధంగా రోజుకు రెండు విషయాల మీద దృష్టి పెట్టి వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భూ విభాగ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికి అందుబాటు ధరలకే బియ్యం విక్రయాలు

### కలెక్టర్ విజయ సునీత. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**పెన్ పవర్, బేస్తవారిపేట ఆగస్టు 4**

ప్రజలకు నాణ్యమైన బియ్యం తక్కువ ధరల్లో పేద మధ్య తరగతి ప్రజలకు అందిస్తున్నామని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కలెక్టర్ విజయ సునీత జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం బేస్తవారిపేట పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని మట్టాల కాంప్లెక్స్‌లో ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తక్కువ ధరలకే బియ్యం అమ్మకాల (రైస్ మార్ట్) కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయ సునీత జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు తో కలిసి ప్రజలకు బియ్యం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో పేద మధ్యతరగతి ప్రజలకు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి అవసరమైన నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కలెక్టర్ విజయ సునీత గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాణ్యమైన బియ్యం అందిస్తున్నామని పేద మధ్య తరగతి కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

### ఎస్వీకేపీ కళాశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించాలని ఆదేశం



**మార్కాపురం రూరల్ పెన్ పవర్ ఆగస్టు 4**

ఈ నెల 15వ తేదీన మార్కాపురం పట్టణంలోని ఎస్వీకేపీ కళాశాలలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పరిశీలించారు. కళాశాల ఆవరణలోని గ్రౌండ్, వేదిక, కూర్చునే ఏర్పాట్లు, భద్రత, పార్కింగ్, తాగునీరు తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడిన కలెక్టర్, వేడుకలను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. భద్రతా చర్యలపై పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ, తహసీల్దార్, ఎస్వీకేపీ కళాశాల ప్రిన్సిపల్ తో పాటు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల చేయూత

### రు. 6 లక్షలు దాటిన విరాళాల సేకరణ





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 04**

సంతమాగులూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు పూర్వ విద్యార్థులు, దాతలు విశేషంగా సహకరిస్తున్నారు. ఇప్పటి వరకు పూర్వ విద్యార్థులు, దాతల నుంచి రూ.6,06,014 విరాళాలు సమకూరగా, వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.2,33,560 వ్యయం చేశారు. ప్రస్తుతం రూ.3,72,454 నిల్వగా ఉందని పాఠశాల అభివృద్ధి కమిటీ వెల్లడించింది. పాఠశాల క్రీడా ఉపాధ్యాయుడు, క్రీడల్లో అత్యున్నత స్థాయిని సాధించిన డాక్టర్ శ్రీనివాసరెడ్డి సూచనలు, సలహాల మేరకు పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు చేపట్టిన పనులు దశలవారీగా పూర్తవుతున్నాయి. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మక్కెన బ్రహ్మయ్య, కార్యనిర్వాహకులు, పూర్వ విద్యార్థులు రిటైర్డ్ ఎస్సై అట్లా మోహన్ రెడ్డి, ప్రముఖ రంగస్థల కళాకారుడు అట్లా శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, పూర్వ విద్యార్థి పరిమి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందించిన దాతలందరికీ పాఠశాల అభివృద్ధి కమిటీ, పూర్వ విద్యార్థుల సంఘం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సంతమాగులూరు తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, మరిన్ని పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# ఎల్ నినో ప్రభావం పై కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమం

### రైతులకు అవగాహన కల్పించిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు






**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 4**

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ జి.రవి తేజ,డాక్టర్ సతీష్, డాక్టర్ స్టెఫి,కార్తీక,డి రచిత,జె.భరద్వాజ్ లు కలిసి ఎల్ నినో ప్రభావాలు మరియు వ్యవసాయంపై దాని ప్రభావాన్ని తగ్గించడానికి తీసుకోవలసిన నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ఆర్.కె. పల్లె, పెద్ద గోగుల పల్లె, మరియు కంభంపాడు మూడు గ్రామాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో నీటి లభ్యతను మెరుగుపరచడానికి తక్కువ నీరు అవసరమయ్యే పంటలను పండించాలని, కరువును తట్టుకునే మరియు తక్కువ కాలంలో పండే పంట రకాలను అవలంబించాలని, మరియు వ్యవసాయ చెరువుల వంటి వర్షపు నీటి సేకరణ మరియు నిల్వ నిర్మాణాలను నిర్మించాలని విద్యార్థులు రైతులకు సలహా ఇచ్చారు. పంటల కీలక పెరుగుదల దశలలో ప్రాణరక్షక నీటిపారుదల అందించడం, మల్చింగ్ ద్వారా నేలలోని తేమను పరిరక్షించడం, మరియు వాతావరణ ఆధారిత పంట ప్రణాళికను అనుసరించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.రైతులు చర్చలో చురుకుగా పాల్గొనడంతో ఈ కార్యక్రమం ఇంటరాక్టివ్‌గా సాగింది. వారు కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో తమ అనుభవాలను పంచుకున్నారు. మరియు నీటి కొరత, వాతావరణ వైవిధ్యాలను తట్టుకోవడానికి ఆచరణాత్మక చర్యలపై విద్యార్థులతో విలువైన సూచనలను ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ అవగాహన కార్యక్రమం శాస్త్రీయ సిఫార్సులు మరియు రైతుల దేశీయ జ్ఞానం మధ్య సంబంధాన్ని బలోపేతం చేయడానికి సహాయపడింది, తద్వారా ఈ ప్రాంతంలో వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించింది. ఈ కార్యక్రమంలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# పులుల సంరక్షణ, నిర్వహణ చర్యలపై అధ్యయనానికి హై పవర్ కమిటీ

### ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఐదుగురు సభ్యులతో నియామకం

### నల్లమలలో అనుమానాస్పద స్థితిలో పులి మరణంపై డిప్యూటీ సి ఎమ్ పవన్ కళ్యాణ్ సీరియస్ అయ్యారు

### పులులు, వన్యప్రాణుల సంరక్షణ చర్యలపై సమగ్ర నివేదికకు ఆదేశించారు

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 4**



పులులే అడవులకు ప్రాణం... అడవులే ప్రకృతి సమతుల్యతకు ఆధారం. పులుల సంరక్షణలో ఎలాంటి రాజీ ఉండదన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు దేశంలోనే అతిపెద్ద పులుల ఆవాసాలలో ఒకటైన నాగార్జునసాగర్--శ్రీశైలం టైగర్ రిజర్వ్ లో పులుల సంరక్షణ వ్యవస్థను సమగ్రంగా సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణకు మార్గదర్శకాలను రూపొందించేందుకు హైపవర్డ్ కమిటీని ఏర్పాటు చేశారు దేశంలోనే అతిపెద్ద పులుల ఆవాసాలలో ఒకటిగా గుర్తింపు పొందిన నాగార్జునసాగర్--శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో రెండు రోజుల క్రితం ఆడ పులి అనుమానాస్పద మృతి ఘటనను పవన్ కళ్యాణ్ తీవ్రంగా పరిగణించారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలన, పులులు, వాటి ఆవాసాల సమర్థవంతమైన సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యల ఆవశ్యకతను గుర్తించారు. పులులతోపాటు వన్యప్రాణుల సంరక్షణ చర్యలు, హనుమాన్ కార్యకలాపాలు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేపట్టేందుకు వీలుగా ఈ హైపవర్డ్ కమిటీకి సిఫారసు చేశారు. రాష్ట్ర అటవీశాఖ సలహాదారు పి. మల్లికార్జునరావు, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండే కమిటీలో శాఖాపరమైన సభ్యులుగా వ్యవహరించనున్నారు. అలాగే వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ సభ్యుడు బి. రాజశేఖర్, హైదరాబాద్ కన్జర్వేషన్ ఫర్ టైగర్ సొసైటీ ప్రతినిధి ఇమ్రాన్ సిద్ధిఖీ, ప్రముఖ వన్యప్రాణి శాస్త్రవేత్త డాక్టర్ ఎం. నవీన్ కుమార్ కమిటీలో సభ్యులుగా సేవలందించనున్నారు. హైపవర్డ్ కమిటీకి క్షేత్రస్థాయిలో సహకారం అందించడంతో పాటు సమన్వయ బాధ్యతలను విధుల్లో ఉన్న సీసీఎఫ్ అధికారి నిర్వహించనున్నారు. పులుల జనాభా, ఆవాసాలకు ఎదురవుతున్న ముప్పులను గుర్తిస్తూ సమగ్ర అంచనా నివేదిక రూపొందించడం, నివారణకు తగిన వ్యూహాలకు రూపకల్పన చేయాలని హైపవర్డ్ కమిటీ సభ్యులకు పవన్ కళ్యాణ్ దిశగా నిర్దేశం చేశారు. ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలు, సంస్థాగత సంస్కరణలు, సిబ్బంది సామర్థ్యాల పెంపు, మౌలిక సదుపాయాల బలోపేతం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై సమగ్రమైన సిఫారసులు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులు, ఇతర భాగస్వామ్య వర్గాలతో సమావేశాలు నిర్వహించి, శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను పరిశీలించి వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. పులుల సంరక్షణ, అడవుల పరిరక్షణ, జీవవైవిధ్య రక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. హైపవర్డ్ కమిటీ సిఫారసులు నాగార్జునసాగర్--శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో తీసుకుంటున్న సంరక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు.

# ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి

### ఎస్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. ఎర్రయ్య డిమాండ్



**అర్ధవీడు,పెన్ పవర్, ఆగస్టు 4:**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ జీవితంలో సుమారు మూడు నుంచి నాలుగు దశాబ్దాలపాటు ప్రజలకు, ప్రభుత్వానికి అంకితభావంతో సేవలందిస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి ఉద్యోగులు పదవీ విరమణ చేసే సమయంలో ప్రభుత్వమే అధికారికంగా ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించే విధానాన్ని ప్రవేశపెట్టాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్ టియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. ఎర్రయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇటువంటి కార్యక్రమం ఉద్యోగుల సేవలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవాన్ని ప్రతిబింబించడమే కాకుండా ప్రభుత్వానికి మంచి గుర్తింపు, ప్రజల్లో విశ్వాసాన్ని కూడా పెంచుతుందని ఆయన అన్నారు. మంగళవారం అర్ధవీడు మండలంలో నిర్వహించిన రెండో రోజు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను ఆయన సేకరించి, వాటిపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు** తల్లికి వందనం' పథకంలో సాంకేతిక సమస్యల కారణంగా రూ.13,000 అందని విద్యార్థులకు, ప్రధానోపాధ్యాయుల ధృవీకరణ ఆధారంగా ప్రత్యేక విధానంలో సత్వరమే చెల్లింపులు జరిపేలా చర్యలు తీసుకోవాలి. మధ్యాహ్న భోజన పథకం కుకింగ్ ఏజెన్సీలలో పనిచేస్తున్న ఆయాలకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలి. 2025 బదిలీలలో రిలీవర్ లేక నిలిచిపోయాయి. ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి కొత్త స్థానాల్లో విధుల్లో చేరేలా చర్యలు చేపట్టాలి. ఖాళీగా ఉన్న ఎడ్యుకేషనల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయాలి. రెండు నెలలుగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. కేవలం ఖాళీల వివరాలు సేకరించడం కాకుండా నియామకాలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి- ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదని, విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సి ఆర్ పి లకు కనీస టైమ్‌స్కేల్ మంజూరు చేయాలని, కేజీబీవీలలో పనిచేస్తున్న సి ఆర్ టి లకు ఎన్నో సంవత్సరాలుగా హామీ ఇచ్చిన కనీస టైమ్‌స్కేల్‌పై వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని, నాడు--నేడు' రెండో దశ పనులకు పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేసి, ఆగిపోయిన పనులను పూర్తి చేయాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం కల్పిస్తున్న ఎఫ్ ఎ సి అలవెన్స్ మంజూరు ఉత్తర్వులు ఆర్జెడి గారు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ టియు జిల్లా కార్యదర్శి డి. నబీ ఖాన్, కంభం మండల అధ్యక్షులు డి. వెంకటేశ్వర్లు, అర్ధవీడు మండల శాఖ అధ్యక్షులు సి. హెచ్. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మునిగేటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వారసత్వ భూమిలో సాగుకు అడ్డుపడుతున్నారని ఫిర్యాదు

### డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన రొంపెర్ల కుటుంబీకులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 4**

మండలంలోని గుంతచెన్నంపల్లి గ్రామానికి చెందిన రొంపెర్ల కుటుంబీకులు పెద్ద సిద్ధయ్య, నాగేశ్వరరావు, సుబ్బరాయుడు, వెంగమ్మ, నాగశేషు మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ హర్షవర్ధన చారిని కలిసి తమ సమస్యను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ కుటుంబ పెద్దల నుంచి వారసత్వంగా సంక్రమించిన సర్వే నంబర్లు 254, 255, 260లలో మొత్తం 27 ఎకరాల 50 సెంట్ల భూమిని గత 60 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆ భూమిలో పిచ్చి చెట్లు, పొదలు అధికంగా పెరగడంతో సాగుకు అనువుగా మార్చేందుకు జేసీబీతో భూమిని శుభ్రం చేస్తుండగా మా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎలాంటి హక్కులు లేకుండానే పనులకు అడ్డుపడుతూ, భూమిని శుభ్రం చేయకుండా అడ్డుకోవడంతో పాటు తమపై దాడికి కూడా పాల్పడుతున్నాడని తెలిపారు. సదరు వ్యక్తి అక్రమ జోక్యాన్ని అరికట్టి, తమకు చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

# రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్ పై కఠిన చర్యలు తీసుకోవాలి

### డాక్టర్ షేక్ మహబూబ్ వలి డిమాండ్

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 4**



పేదలకు ఉచితంగా ఇచ్చే రేషన్ బియ్యాన్ని అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి ఆరోపించారు. ఈ అక్రమాలపై అధికారులు మౌనంగా ఉండటం సరికాదని ప్రశ్నించారు. రేషన్ బియ్యం మాఫియాపై సీట్ విచారణ జరపాలని ఓ ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. అక్రమాలకు సహకరిస్తున్న అధికారులు, రాజకీయ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ గోదాములు, వాహనాలు, దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు పెంచాలని, రేషన్ పంపిణీలో డిజిటల్ ట్రాకింగ్ తప్పనిసరి చేయాలని, బాధ్యులను వెంటనే సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పేదలకు అందాల్సిన బియ్యం పూర్తిగా లబ్ధిదారులకే అందేలా పారదర్శక వ్యవస్థ అమలు చేయాలని డాక్టర్ మహబూబ్ వలి అన్నారు. రేషన్ బియ్యం మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, పేదల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.

# మీ భూమి మీ హక్కు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

### కలెక్టర్ విజయ సునీత ఎమ్మెల్యే ముత్తుముల అశోక రెడ్డి





**పెన్ పవర్ బేస్తవారిపేట ఆగస్టు 4**

బేస్తవారిపేట మండలం పూసలపాడు పంచాయతీ ఒందుంట్ల గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన 346 పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి జిల్లా కలెక్టర్ విజయ సునీత జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు పాల్గొని రైతు లబ్ధిదారులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల భూ హక్కులను మరింత పటిష్ఠంగా పరిరక్షించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మీ భూమి మీ హక్కు కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ రాజముద్రతో అందజేస్తున్న పట్టాదారు పాసుపుస్తకాలు రైతులకు తమ భూమిపై పూర్తి హక్కుకు అధికారిక గుర్తింపుగా నిలుస్తాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ ద్వారా రైతులు ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు అని నేడు కూటమి ప్రభుత్వం లో ఆ యాక్ట్ రద్దు చేసి అత్యంత పారదర్శికంతో అన్ని రక్షణ ప్రమాణాలతో రాజ ముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు రైతులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై అవగాహనకార్యక్రమం

**పొన్నలూరు పెన్ పవర్ ఆగస్టు 4**

మండలంలోని విప్పగుంట గ్రామంలో మంగళవారం డి ఎల్ డి ఓ పి నాగమణి చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త సేకరణ వ్యర్థాల వర్గీకరణ నిర్వహణ తీరును పరిశీలించి చెత్త సంపద కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని క్లాప్ మిత్రులకు సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. తదుపరి పొన్నలూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలు కార్యాలయ నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్ బాబు,డిప్యూటీ ఎంపీడీవో వెంకట్రావు, నారాయణ,భారతి,సురేంద్ర ఉన్నం కొండలరావు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రాజముద్ర తో ముద్రించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేసిన బోనేని వెంకటేశ్వర్లు యాదవ్





**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 4**

రాష్ట్ర ప్రభుత్వం రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలను మంగళవారం కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనీని వెంకటేశ్వర్లు యాదవ్ నాగిరెడ్డిపల్లి గ్రామ రైతులకు పంపిణీ చేశారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం నాగిరెడ్డిపల్లి గ్రామంలో కొమరోలు తాసిల్దారు భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాజముద్రతో ముద్రించిన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ శాసన సభ్యుల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు యాదవ్ తాసిల్దార్ తో కలిసి రైతులకు రాజముద్రలతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఆ సందర్భంగా వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను మోసం చేసేందుకు పట్టాదారు పాస్ పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫోటో ముద్రించారని, దీనితో రైతులు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారని ఆయన చెప్పారు. రైతుల పడుతున్న ఆందోళన గమనించిన నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో వచ్చిన హామీ మేరకు రాజ ముద్రలతో పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుని రైతుల భూములపై వారికే సర్వహక్కులు ఉండే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. దీనికి రాష్ట్రవ్యాప్తంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు ధన్యవాదాలు తెలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి రైతు పక్షపాతిగా పనిచేస్తూ రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పందర బోయిన భూపాల్, మహేష్, కొత్తకోట ఆవులయ్య,కటారు బాలరాజు, తిరుమలయ్య, తోపాటు నాగిరెడ్డిపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

# తల్లిపాలే బిడ్డకు అసలైన ఆరోగ్యం సూపర్వైజర్ పి ప్రమీల





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 04**

సిడిపిఓ సుధా ఆదేశాల మేరకు సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామంలో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సూపర్వైజర్ పి ప్రమీల మాట్లాడుతూ, తల్లులకు తల్లిపాల వలన కలిగే ఉపయోగాలు తల్లిపాలు ఇవ్వడం వలన బిడ్డకు మేధో శక్తి బాగా అభివృద్ధి చెందుతుందని, తల్లిపాలు ఇవ్వడం వలన బిడ్డకు ఆరోగ్యం పుష్టిగా ఉంటుందని, తల్లి బిడ్డలకు మంచి అనుబంధం ఏర్పడుతుందని, బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం వలన ప్రెగ్నెంట్ గా ఉన్న టైంలో తల్లి అధిక బరువు ఉన్న సమతూలిన బరువుకి తగ్గుతుందని, అంతేకాకుండా బ్రెస్ట్ క్యాన్సర్ ఇలాంటి వ్యాధులకు గురి కాకుండా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా దిగువ, మధ్య తరగతి కుటుంబాలలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఒకటవ కాన్పుకి రెండవ కాన్పుకి మధ్య దూరం పెరుగుతుందని తల్లికి బిడ్డకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంచి ఆరోగ్యంగా, సంతోషంగా పిల్లల్లో మంచి గ్రోత్ ఉంటుందని తెలిపారు. అలాగే తల్లిపాలు ఇవ్వకపోవడం వల్ల జరిగే నష్టాలు గురించి కూడా వారు తల్లులకు వివరించారు. ఇవే కాకుండా తల్లులకు ప్రెగ్నెన్సీ టైంలో కానీ బాలింత టైం లో కానీ ఏదైనా ఇబ్బందులు ఉంటే అంగన్వాడీ కేంద్రంలోని అంగన్వాడీ వర్కర్ల ద్వారా సమాచారం తెలియపరిచారని వారు తల్లులందరికీ అర్థమయ్యేలా క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మక్కెనవారిపాలెం లోని అంగన్వాడీ కార్యకర్తలు సుమతి, నాగలక్ష్మి, దోరతి, శైలజ వారితోపాటు అంగనవాడి సహాయకురాలు శివకుమారి పాల్గొన్నారు.

# పొన్నలూరులో ఇంటింటికి టిడిపి కార్యక్రమం



**పొన్నలూరు పెన్ పవర్ ఆగస్టు 4**

మండల కేంద్రమైన పొన్నలూరులో మంగళవారం ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అదే సమయంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని వారు తెలిపారు ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసం పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మండవ మురళీమోహన్, నల్లపనేని రాము, చెన్నాయి పాలెం యానాది, లింగం గుంట బ్రహ్మ పేరయ్య, చుండి రమేష్ బాబు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కొమరోలులో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించిన వార్డు మెంబర్ సుభాని

## కొమరోలు సహకార సంఘం చైర్పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహణ





**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 4**

కొమరోలు పట్టణంలోని సినిమా హాలు సమీపంలో ని వీధులలో మంగళవారం కొమరోలు వార్డు మెంబర్ షేక్ సుభాని ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సూచనల మేరకు కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్నది. అందులో భాగంగా మంగళవారం ముత్తుముల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో వార్డు మెంబర్ షేక్ సుభాని పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో కలిసి కొమరోలు లోని సినిమా హాలు సమీపంలోని వీధులలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాలలో చేసిన అభివృద్ధి, ప్రజా సంక్షేమం పథకాల గురించి, గత రెండు సంవత్సరాలుగా గిద్దలూరు శాసనసభ్యులు అశోక్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి చేస్తున్న కృషిని ప్రజలకు వివరించారు. ఆ కార్యక్రమంలో వార్డు మెంబర్ షేక్ సుభానితోపాటు తెలుగు యువత ప్రతినిధులు కరీముల్లా, కాశి, జిలాని, బుజ్జి,కే. సుభాని తదితరులు పాల్గొన్నారు.

# రాజుపాలెం అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 4**

కొమరోలు మండలం రాజుపాలెంలోని అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ టీచర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆ కార్యక్రమానికి అంగన్వాడి కేంద్ర పరిధిలోని తల్లులు, గర్భవతులు, బాలింతలు హాజరయ్యారు.వారికి తల్లిపాల ప్రాముఖ్యత తో పాటు గర్భవతులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు వైద్య పరీక్షలు తదితర వాటి గురించి అంగన్వాడీ టీచర్ జయలక్ష్మి వివరించి అవగాహన కల్పించారు. శిశువు జన్మించిన వెంటనే శిశువు తల్లిపాలు అందించాలని ముర్రుపాలలో పౌష్టికాహారం ఎంతో ఉంది శిశువు పెరుగుదలకు ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని ఆమె వివరించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న ఆహార పదార్థాలు పౌష్టికాహారాన్ని గర్భవతులు బాలింతలు తల్లులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆ కార్యక్రమంలో అంగన్వాడీ ఆయా పద్మావతి చిన్నారులు పాల్గొన్నారు.

# స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 4**

గ్రామీణ ప్రాంతాలలో స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నేత్రుత్వం లోని సామాజిక శంఖారావం బృందం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ కార్యాలయాల వద్ద మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని సమస్యల అధ్యయనం కోసం సామాజిక శంఖరావం బృందం మండలం లోని సిఎస్పురం, ముండ్లపాడు, చింతలపాలెం, అరివేముల, చెర్లోపల్లి, ఏకనాంపురం, పిల్లిపల్లి, డిజిపేట, రేగులచెలక, గుంతచెన్నంపల్లి, పుల్లగూరపల్లి, కొండబోయిన పల్లి, ఉప్పలపాడు, నల్లమడుగుల, మిట్టపాలెం, ఆర్కేపల్లి, కే అగ్రహారం, పెదగోగులపల్లి, ఆరెపాలెం గ్రామాలలోని దళితవాడలో పర్యటించిగా ప్రతీ కాలనీ లోనూ త్రాగు నీరు, డ్రైనేజి సమస్య, విద్యుత్ దీపాల సమస్య ఉన్నాయనీ స్మశాన స్థలాలు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇది సిగ్గు పడాల్సిన విషయమన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నారే కానీ పేదల జీవితాలు మాత్రం మారడం లేదన్నారు. కెవిపిఎస్ పోరాడి సాధించుకున్న 1235 జిఓ ను నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ హర్షవర్ధనాచారి లకు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక శంఖారావం కోఆర్డినేటర్ బీజే రత్నం, పొదిలి నరసింహులు, ఎం రత్నారెడ్డి, అంకెపల్లి వెంకటేశ్వర రెడ్డి, థామస్, జి ఏసుదాస్ సిహెచ్ అంకమ్మరావు బి కొండలు వివిధ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇంటింటికీ తెలుగుదేశం.. ప్రజలతో మమేకమైన గూడూరి ఎరిక్షన్ బాబు

## మురికిమళ్ళ, నరజాముల తండాల్లో విస్తృత ప్రచారం.. -సంక్షేమ పథకాలపై అవగాహన



**పుల్లల చెరువు పెన్ పవర్ ఆగస్టు 4**

తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం పుల్లల చెరువు మండలంలోని మురికిమళ్ళ, నరజాముల తండాల్లో ఉత్సాహంగా నిర్వహించారు.యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు.ప్రతి కుటుంబాన్ని కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు పార్టీ కరపత్రాలను అందజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోందని తెలిపారు. గత రెండేళ్ల కాలంలో యర్రగొండపాలెం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పును తీసుకొచ్చాయని అన్నారు. రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం వంటి అన్ని రంగాల్లో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ,దీపం వంటి సంక్షేమ పథకాల వల్ల మహిళలు, రైతులు, పేద కుటుంబాలు ప్రత్యక్షంగా లబ్ధి పొందుతున్నారని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా పార్టీ నాయకులు కృషి చేస్తున్నారని చెప్పారు.అనంతరం నిర్వహించిన గ్రామ సమావేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను ఓర్పుగా విన్న గూడూరి ఎరిక్షన్ బాబు, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పుల్లల చెరువు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పొట్ల గోవిందు, క్లస్టర్ ఇన్చార్జీలు, యూనిట్ ఇన్చార్జిలు, మండల కూటమి నాయకులు, తండా నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువతతో పాటు గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామాల్లో పార్టీ నాయకులకు ప్రజలు ఘన స్వాగతం పలకడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ఒంగోలు ఫారెస్ట్ రేంజ్ అధికారి తులసి రావు ను అభినందించిన మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 04**

ఒంగోలు కలెక్టరేట్లో ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ (ఎఫ్ఎస్ఒ)గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ, ఇటీవల పదోన్నతిపై ఒంగోలు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ ఆర్ ఒ)గా బాధ్యతలు చేపట్టిన తులసి రావు మంగళవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా. శ్రీ బాల వీరాంజనేయస్వామిని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పు నాయుడు పాలెం లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో, నూతనంగా పదోన్నతి పొందిన తులసి రావు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి నూతన ఫారెస్ట్ రేంజ్ అధికారికి అభినందనలు తెలియజేశారు. ?అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఒంగోలు రేంజ్ పరిధిలో అటవీ సంపద రక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక అటవీ పెంపకం కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న పర్యావరణ హిత కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ, ప్రజాసేవలో నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ?తన పదోన్నతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి, సత్కరించిన మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామికి రేంజ్ ఆఫీసర్ తులసీరావు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.



# చిరుధాన్యాల సాగుతో ఉత్తమ ఫలితాలు - ఎంఏఓ రవికుమార్



**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 04:**

ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో చిరుధాన్యాల సాగుతో రైతులు ఉత్తమ ఫలితాలు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి బి.రవికుమార్ తెలిపారు. మండలంలోని దారకానిపాడు మరియు బసిరెడ్డిపాలెం రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామలలో ఎం.ఏ.ఓ రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా మిల్లెట్స్ అనేవి చిన్న గింజల గల ధాన్యాలు, ఇవి భారతీయ వంటకాలలో చాలా ప్రముఖంగా ఉన్నాయని, వీటిని అనేక రకాల వంటకాలు మరియు పిండివంటలు తయారీలో వాడుతారని, ఇవి పోషకాలతో నిండి ఉండి, ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు కలిగి ఉన్నాయని రవికుమార్ తెలిపారు. ఇవి మిల్లెట్స్ విటమిన్స్, మినరల్స్, ఫైబర్ మరియు ప్రోటీన్స్ సమృద్ధిగా ఉండి పోషక సంపదను, శారీరక మరియు మానసిక శక్తిని పెంచుతూ శక్తి వృద్ధిని, వీటిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకాన్ని తగ్గిస్తుందని, షుగర్ స్థాయిల



నియంత్రణలో ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అంతేకాకుండా మధుమేహం ఉన్న వారికి ప్రయోజనకరం అని, హృదయ ఆరోగ్యం కూడా వీటిలో ఉండే ఫైబర్ తో సాధ్యమని, క్యాన్సర్ ప్రతిరోధకతకు మిల్లెట్స్ లో ఉండే అంటిఆక్సిడెంట్స్ ఉపయోగపడతాయని, తక్కువ కేలరీలు మరియు అధిక ఫైబర్ ఉండటం వలన, వీటిని తినడం వలన బరువు నష్టం సాధ్యమవుతుందన్నారు. మొత్తముగా మిల్లెట్స్ మన ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉండి, సహజమైన ఆహారంలో భాగమయ్యే దిశగా మనం అడుగులు వేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమములో దారకనిపాడు వి.ఏ.ఏ ఇ రమణయ్య , ఏ.హెచ్.ఏ లు, గ్రామ నాయకులు మరియు ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చేధించిన పెద్దపులి మృతి కేసు ఏడుగురు నిందితుల అరెస్ట్

## పులి గోర్లు , కాళ్ళ ఎముకలు , గొడ్డలి , నాటు తుపాకీ స్వాధీనం

## ఇంకా కొనసాగుతున్న దర్యాప్తు -ప్రాజెక్ట్ టైగర్, గిద్దలూరు డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 4**

జులై31 న తెల్లవారుజామున గిద్దలూరు ప్రాజెక్ట్ టైగర్ డివిజన్, గుండ్లకమ్మ రేంజ్, రాచర్ల సెక్షన్, రాచర్ల బీట్‌లో ఒక పెద్ద పులి కళేబరం కనుగొనబడింది. ఎన్‌టిసిఎ నిర్దేశించిన ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం, అటవీ సిబ్బంది వెంటనే కళేబరాన్ని , ఆ ప్రదేశాన్ని స్వాధీనం చేసుకుని మృతి చెందిన పులికి పోస్ట్‌మార్టం నిర్వహించామని నమూనాలను సేకరించి ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ ల్యాబ్ పంపించామని నిషాకుమారి తెలిపారు మంగళ వారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. మృతి చెందిన పులి మగ పులిగా గుర్తించబడిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదాల పవన్ కళ్యాణ్ , మంగళగిరి, ఆంధ్రప్రదేశ్ ప్రధాన అటవీ సంరక్షణాధికారి , ప్రధాన వన్యప్రాణి సంరక్షణాధికారిల ఆదేశాల మేరకు, నంద్యాల ఎన్‌ఎస్‌టిఆర్, అటవీ సంరక్షణాధికారి , ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, గిద్దలూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి నేతృత్వంలో ఒక బృందం తక్షణమే సవివరమైన దర్యాప్తు చేపట్టిందన్నారు. అన్ని కోణాల నుండి సమగ్ర విచారణ జరిపేందుకు గిద్దలూరు సబ్-డిఎఫ్ఓ, గుండ్లకమ్మ ఎఫ్ఆర్ఓ, గుండ్లకమ్మ ఏఆర్ఓ, ఎన్‌ఎస్‌టిఆర్ పశువైద్యుడు , అటవీ సిబ్బందితో కూడిన పలు ఉప బృందాలను ఏర్పాటు చేశామన్నారు. దర్యాప్తు ఆధారంగా ఏడుగురు



నేరస్థులను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుల నుంచి పులికి చెందిన 7 పంజా గోర్లుతో పాటు అవయవాల ఎముకలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నేరస్థుల నుంచి ఒక దేశీయ తుపాకీ, ఒక గొడ్డలిని కూడా స్వాధీనం చేసుకున్నారు. దీని ప్రకారం, గుండ్లకమ్మ రేంజ్‌లో డిఓఆర్ నెం.05/2026-27 అటవీ నేర కేసు నమోదు చేశామన్నారు. గిద్దలూరు డివిజన్, ప్రాజెక్ట్ టైగర్ అధికార పరిధిలోని రాచర్ల మండలం, జెల్లివారి పుల్లలచెరు రెవెన్యూ గ్రామం పరిధిలో దుండగులు నాటు తుపాకీతో పులిని హతమార్చారని. పులి కాళ్లు, గోళ్లను నరికివేసి, దాని కళేబరాన్ని అటవీ ప్రాంతానికి తరలించి అక్కడ పడవేశారని




పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తులో, పలు బృందాలు అన్ని కోణాల్లోనూ క్షుణ్ణంగా క్షేత్రస్థాయి విచారణ జరపడం, డాగ్ స్క్వాడ్‌ను ఉపయోగించడం, సాంకేతిక సహకారం వంటివి కీలకమయ్యాయి. హనుమాన్ బృందం ప్రధాన పాత్ర పోషించిందన్నారు. ఈ కేసులో చురుకైన సహకారం అందించినందుకు మార్కాపూర్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వి. హర్షవర్ధన్ రాజు, ., గిద్దలూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ రామ కోటయ్య, సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శివ కు నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతుందని ఇంకా నిందితులు ఉంటే అరెస్టులు చేస్తామని తెలిపారు.

# పిచ్చికుక్కస్వైర విహారం

## 13 మంది పై దాడి, ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 4**

గిద్దలూరు పట్టణంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసిన సంఘటన సోమవారం నాడు జరిగింది. పిచ్చి కుక్క చాకలి వీధి, విశ్వభారతి స్కూల్ పరిసర ప్రాంతాల్లో స్వైరవిహారం చేసిన పిచ్చికుక్క ఒకే సమయంలో దాదాపు 13 మందిపై దాడి చేసి గాయపరిచింది. గాయపడిన వారిని స్థానికులు వెంటనే గిద్దలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందించారు. సమాచారం అందుకున్న మున్సిపల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పిచ్చికుక్కను గుర్తించి చంపివేశారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గిద్దలూరు పట్టణంలో వీధికుక్కల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి వీధికుక్కల నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# కొమరోలు లోని 5వ నెంబర్ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 4**

కొమరోలు లోని 5వ నెంబరు అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ టీచర్ సిద్ధం ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆ కార్యక్రమానికి అంగన్వాడి కేంద్ర పరిధిలోని తల్లులు, గర్భవతులు, బాలింతలు హాజరయ్యారు. వారికి తల్లిపాల ప్రాముఖ్యత తో పాటు గర్భవతులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు వైద్య పరీక్షలు తదితర వాటి గురించి అంగన్వాడీ టీచర్ సిద్ధమ్మ వివరించి అవగాహన కల్పించారు. శిశువు జన్మించిన వెంటనే శిశువు తల్లిపాలు అందించాలని ముర్రుపాలలో పౌష్టికాహారం ఎంతో ఉంది శిశువు పెరుగుదలకు ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని ఆమె వివరించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న ఆహార పదార్థాలు పౌష్టికాహారాన్ని గర్భవతులు బాలింతలు తల్లులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆ కార్యక్రమంలో అంగన్వాడీ ఆయా కే వెంకటలక్ష్మి చిన్నారులు పాల్గొన్నారు.

# నేడు నారాయణస్వామి ఆరాధన మహోత్సవ వేడుకలు

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 4**

జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన మిట్టపాలెం లో వేం చేసియున్న నారాయణస్వామి దేవస్థానంలో ఆరాధన మహోత్సవ వేడుకలు నేడు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి గిరి రాజు నరసింహ బాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ తెలిపారు నారాయణస్వామి ఆరాధన మహోత్సవాలు భక్తి, ఆధ్యాత్మిక వైభవాల నడుమ నేడు ఘనంగా నిర్వహిస్తారు నారాయణస్వామివే శివ కేశవ రూపంలో శివునిగా నామంతో నారాయణుడిగా పిలవబడుతున్న నారాయణస్వామి మారుమూల ప్రాంతమైన మిట్టపాలెం గ్రామం నందు వెలసియున్నారు శ్రీ స్వామివారి ఆరాధన మహోత్సవం ఆషాడ బహుళ సప్తమి రోజు పర్వదినం పురస్కరించుకొని మహోత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఆరాధన మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి అభిషేకాలు, విశేష అర్చనలు, సహస్రనామార్చన, హోమాలు, కోలాటాలు, భజన, కూచిపూడి నృత్యాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ఈ ఉత్సవాల ప్రత్యేకతగా నిలుస్తోంది. మహావిష్ణువు స్వరూపమైన నారాయణస్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధన మహోత్సవాల్లో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకోవడం ద్వారా విశేష పుణ్యఫలితం లభిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. అందుకే ప్రతి ఏడాది భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు చెల్లించుకొనుటకు స్వామివారి ఆశీస్సులు పొందేందుకు అధిక సంఖ్యలో తరలి వస్తుంటారు ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు భక్తుల రద్దీ దృష్ట్యా ఉదయం ఆరు గంటల నుండి 9 గంటల లోపు వీఐపీలకు స్వామివారిని దర్శించుకొనుటకు అవకాశం కల్పించామని, తదుపరి వచ్చు వారికి యధావిధిగా క్యూలైన్ల ద్వారా వెళ్ళవలసి ఉంటుందని అన్నారు సుదూర ప్రాంతాల నుండి వచ్చే సాధారణ భక్తులకు గంటల తరబడి క్యూ లైన్లో వేచి ఉండకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

# ఎమ్మెల్యే ఇంటూరికి కృతజ్ఞతలు తెలిపిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు, నాయకులు.






**ఉలవపాడు, పెన్ పవర్, ఆగస్టు 04**

ఆర్థికంగా వెనుకపడి, ఆరోగ్య సమస్యతో భాద పడుతున్న తనకి సీఎంఆర్ఎఫ్ చెక్కు ఎంతగానో ఉపయోగపడినదని వీరేపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారు చిలకపాటి కొండయ్య, అతని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు, స్థానిక టీడీపీ నాయకులకు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. గత కొంతకాలంగా మోకాలి నొప్పితో తీవ్రముగా భాద పడుతూ, తీవ్రత ఎక్కువగా ఉండటంతో మోకాలి ఆపరేషన్ చేయించుకోవడం జరిగినదని, ఆపరేషన్ చేయించుకొని తీవ్ర ఆర్థికభారంలో ఉన్న తనకు స్థానిక టీడీపీ నాయకుల సూచనతో సీఎంఆర్ఎఫ్ కు నమోదు చేయగా, రూ:78,000/-లు మంజూరు అయ్యాయని, అవి ఎమ్మెల్యే చేతులు మీదుగా అందుకోవడం జరిగినదని లబ్ధిదారు కొండయ్య తెలిపారు.

టీడీపీ నాయకులు ఎండ్లూరి నతానియేలు మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని, పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందుతుందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వెంటనే ఆలస్యం కాకుండా, లబ్ధిదారులకు చెక్కులు అందించడంలో ముందు వరుసలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తూ, ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తున్నదన్నారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచి, రాష్ట్ర అభివృద్ధికి మనవంతు సహాయ సహకారాలు అందిద్దామని నతానియేలు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎండ్లూరి నతానియేలు, గొల్లపూడి వెంకట సత్య ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ గొల్లపూడి శివ, దోనెంపూడి నరసింహ తదితరులు ఉన్నారు.

# భోగాపురం పై ఉన్న శ్రద్ధ దొనకొండ పై ఎందుకు లేదు -కైపు వెంకట కృష్ణారెడ్డి

**దర్శి ఆగస్టు 4 పెన్ పవర్ :**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించడం హర్షనీయమని అయితే దానిని చూపిస్తూ ఉత్తరాంధ్ర మొత్తం అభివృద్ధి అయిపోయినట్లుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలబొల్లి మాటలు చెప్పడం మానుకోవాలని రాష్ట్ర అసంఘటిత కార్మికులు మరియు ఉద్యోగుల కాంగ్రెస్ కేకేసి చైర్మన్ దర్శి నియోజకవర్గ ఇన్చార్జి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. ఉత్తరాంధ్రకు విమానాశ్రయం కొత్త కాదని గుర్తు చేశారు. 1941 లోని విశాఖపట్నంలో సైనిక విమానాశ్రయం ఏర్పాటయిందని 1954 కాంగ్రెస్ పాలనలో పౌర విభాగ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, 1962 నుంచి పౌర విమాన సేవలు అందుబాటులోకి వచ్చాయని 2010లో విశాఖపట్నం విమానాశ్రయానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది అని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఏమైందని ఉత్తరాంధ్ర రాయలసీమ వెనుకబడిన ప్రాంతాలు బుందేల్ఖండ్ ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఏమైందని ప్రశ్నించారు. డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకొనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రానికి కావలసిన హక్కులు నిధులు సాధించి చూపించాలని డిమాండ్ చేశారు.

దొనకొండ విమానాశ్రయం ప్రభుత్వాలకి కనిపించడం లేదా.

భోగాపురం విమానాశ్రయం పై చూపుతున్న శ్రద్ధ రాష్ట్రానికి నడిబొడ్డున దర్శి నియోజకవర్గానికి మరో మణిహారంగా ఉన్న చారిత్రక తినకుండా విమానాశ్రయంపై ఎందుకు చూపడం లేదని కైపు వెంకటకృష్ణారెడ్డి ప్రశ్నించారు. తినకుండా విమానాశ్రయాన్ని పునరుద్దించి అభివృద్ధి చేస్తే దర్శి నియోజకవర్గంలో పాటు ప్రకాశం జిల్లా పరిసరాల ప్రాంతాలకు పరిశ్రమలు పెట్టుబడులు వచ్చే అవకాశాలు పెరుగుతాయని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. దొనకొండ విమానాశ్రయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి విమాన సేవల పునరుద్ధరనకు




కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్యచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. భోగాపురం విమానశ్రయాన్ని మేము వ్యతిరేకించడం లేదు. కానీ విమానాశ్రయం వచ్చినంత మాత్రాన ఉత్తరాంధ్ర మొత్తం అభివృద్ధి అయిపోయిందని మాటలు చెప్పొద్దు. నిజమైన వృద్ధి అంటే అన్ని ప్రాంతాలకు సమాన అవకాశాలు పరిశ్రమలు ఉపాధి సాగునీరు మౌలిక సదుపాయాలు కల్పించడం. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి, ఉత్తరాంధ్ర రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి, దొనకొండ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలి దర్శి నియోజకవర్గం లోని ఐదు మండలాలను కరువు మండలాలను ప్రకటించి ప్రత్యేక ప్యాకేజీ విడుదల చేయాలి అని వెంకట కృష్ణారెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఇంటింటికి తెలుగుదేశం పార్టీ ప్రచార లక్ష్యాన్ని పూర్తిచేసిన ముత్తుముల ఎల్లారెడ్డి



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 4**

కొమరోలు మండలం బాదినేని పల్లె పంచాయతీలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యక్రమాన్ని పూర్తిచేసి లక్ష్యాన్ని అధిగమించామని కొమరోలు మండలం తెలుగుదేశం పార్టీ కో కన్వీనర్,,బాదినేని పల్లి పంచాయతీ యూనిట్ ఇన్చార్జి ముత్తముల ఎల్లారెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సూచనల మేరకు తాము బాదినేని పల్లి పంచాయతీలోని 263 బూతు పరిధిలో గత వారం రోజులుగా ఇంటింటి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. తమకు 350 ఇళ్లను కేటాయించారని తనతో పాటు పలువురు కార్యకర్తలు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారని ఎల్లారెడ్డి తెలిపారు. తమకు నిర్దేశించిన లక్ష్యాన్ని మంగళవారం సాయంత్రానికి దిగ్విజయంగా పూర్తి చేశామని, ఆ సందర్భంగా గత రెండు సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వ అమలు చేస్తున్నఅభివృద్ధి,, సంక్షేమ పథకాలను,గిద్దలూరు శాసనసభ్యులు అశోకరెడ్డి గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రజా సంక్షేమాన్ని ప్రజలకు వివరించామని ఆయన తెలిపారు ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలలో తనతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు హేమారెడ్డి, వెంకటరెడ్డి, మల్లికార్జున్, లోక్కు శరత్ బాబు, గుడిమల్ల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారని ఎల్లారెడ్డి తెలిపారు.

# ఆనికాళ్లపల్లి మాజీ సర్పంచ్ మేకా యాకోబు మృతి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 4**



మండలంలోని ఆనికాళ్లపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మేకా యాకోబు అనారోగ్యంతో మంగళవారం కన్నుమూశారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రజాసేవా దృక్పథంతో గ్రామాభివృద్ధికి కృషి చేసిన నాయకుడిగా, క్రమశిక్షణ కలిగిన మాజీ సైనికుడిగా ఆయనకు గ్రామస్తుల్లో మంచి గుర్తింపు ఉంది. మేకా యాకోబు మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎడవల్లి నారాయణరెడ్డి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యాకోబు అందించిన సేవలు గ్రామ ప్రజలకు చిరస్మరణీయమని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని వారికి ఓదార్పునిచ్చారు. మేకా యాకోబు మృతిపట్ల గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

## తర్లుపాడులో టీడీపీ ఆత్మీయ సమావేశం

**మండలంలో తరిపించిన విగ్నేష్ రెడ్డి**





**తర్లుపాడు పెన్ పవర్ ఆగస్టు4**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి తనయుడు కందుల విగ్నేష్ రెడ్డి తర్లుపాడు మండలంలో పర్యటించారు. గొల్లపల్లి, నాగేళ్ళముడుపు గ్రామాల్లో ఆయనకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడ టీడీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్నేష్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి బలమని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే సహకారంతో తర్లుపాడు మండలాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజల నుండి అపూర్వ స్పందన.

**ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి.**

**ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి.**





**పెన్ పవర్ బేస్తవారిపేట ఆగస్టు 4**

బేస్తవారిపేట మండలం పూసలపాడు పంచాయతీ పరిధిలోని ఒందుట్ల గ్రామంలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవల గురించి వివరించారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పారదర్శక పాలనతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, గ్రామాల పురోగతి, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## అక్రమ కోడి పందేల నిర్వహణపై టాస్క్ ఫోర్స్ పోలీసులు కఠిన చర్యలు

**– 8 మంది అదుపులోకి, రూ.12200/-నగదు, రెండు కోళ్లు, 6 సెల్ ఫోన్లు,రెండు మోటర్ సైకిల్ స్వాధీనం**

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 04**

ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్సై చెంచయ్య, ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా, సిబ్బంది దాడులు నిర్వహించారు. సింగరాయకొండ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో బింగినపల్లి గ్రామ సాల్ట్ సొసైటీ పొలాల్లో ఉప్పు కొటార్ల మధ్య నిర్వహించిన దాడిలో కోడి పందేలు నిర్వహిస్తున్న 8 వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 2కోళ్ళు 6సెల్ ఫోన్లు 2మోటర్ సైకిల్, =o12,200/- నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిని తదుపరి చర్యల నిమిత్తం సింగరాయకొండ పోలీస్ స్టేషన్ లో అప్పగించారు.



# శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణ -జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

**- కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం - పాల్గొన్న జిల్లా ఎస్పీ, డిటిసి ఆర్.సుశీల**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 04**

రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు మరింత సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. ఈ దిశగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తుండడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఎస్పీ వి.హర్ష వర్ధన్ రాజుతో కలిసి జిల్లాలోని పరిస్థితిపై ఆయన సమీక్షించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటిపై తీసుకున్న చర్యల నివేదికను డిటిసి ఆర్.సుశీల ఈ సందర్భంగా వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా యంత్రాంగం దృష్టి సారించింది అన్నారు. తాను, ఎస్పీ కలిసి ఒంగోలు నగరంతో పాటు అద్దంకి, సంతమాగులూరు ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను ఇటీవల సందర్శించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. క్షేత్రస్థాయి అధికారులు కూడా తమ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ కు సమిష్టిగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాహనదారులకు కూడా రోడ్డు భద్రత నియమాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు పోలీసులు, వైద్యులు, ఇతర అధికారులు స్పందిస్తున్న తీరును ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో నిరంతరం పనిచేయాలని పిలుపునిచ్చారు.ఎస్పీ మాట్లాడుతూ గత ఏడాది మొదటి ఏడు నెలల కాలంతో పోల్చితే ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు రోడ్డు ప్రమాద మరణాలు 18.5 శాతం తగ్గాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు





జరిగినప్పుడు అధికారులు స్పందించే సమయం కూడా తగ్గిందని, సగటున ఎనిమిది నిమిషాలలోనే స్పందిస్తున్నారని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు కూడా 3.5 శాతం తగ్గినట్లు వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న 39,182 మందికి ఈ ఏడు నెలల కాలంలో రూ.2.38 కోట్ల జరిమానా విధించామన్నారు. ఇందులో రూ.1.34 కోట్ల వరకు వసూలు అయ్యాయి అన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 1869 మందికి ఒక కోటి రూపాయలకు పైగా జరిమానా విధించామని, 67 మందికి జైలు శిక్ష పడిందని చెప్పారు. జిల్లాలో వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన 9 వేలకు పైగా ఎల్ఈడీ లైట్లను పోలీసు, రవాణా సిబ్బంది తొలగించినట్లు ఆయన వివరించారు. విద్యా సంస్థల బస్సుల ఫిట్నెస్ పైనా నిరంతరం దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వీటిని పరీక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డి.ఎం.హెచ్.ఓ. టి. వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ హేమంత్, రోడ్లు భవనాల శాఖ ఎస్.ఈ. రవి నాయక్, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. అశోక్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల అధికారులు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడి ఆరోగ్యానికి ఎన్డీయే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

**– రాష్ట్ర మంత్రి శ్రీ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 04**

రాష్ట్రంలోని ప్రతి పేదవాడి ఆరోగ్యానికి, ప్రాణ రక్షణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా. శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ?మంగళవారం నాడు కొండేపి నియోజకవర్గం, టంగుటూరు మండలం, తూర్పు నాయుడు పాలెం లోని తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ గత జులై 23న మంజూరైన ఆర్థిక సాయానికి సంబంధించి, కొండేపి నియోజకవర్గానికి చెందిన మొత్తం 65 మంది లబ్ధిదారులకు గాను 57 లక్షల 05 వేల 412 రూపాయల విలువైన సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు, ఎల్.ఓ.సి (ఎల్ఒసి) పత్రాలను పంపిణీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇందులో 14 మందికి ఎల్.ఓ.సి రూపంలో, 51 మందికి చెక్కుల రూపంలో సాయం అందిందన్నారు. ఇప్పటివరకు కొండేపి నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 1,958 మంది బాధితులకు 16 కోట్ల 54 లక్షల 34 వేల 699 రూపాయల ఆర్థిక సాయాన్ని సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించి వారి కుటుంబాలకు కొండంత అండగా నిలిచామని ఆయన వివరించారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. పేదరికం ఏ ఒక్కరి వైద్యానికి అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆరోగ్య శ్రీ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ, ఉచిత మరియు నాణ్యమైన వైద్య సేవలు పేదలకు అందేలా చూస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా, సంజీవని పథకం ద్వారా ఇంటి వద్దకే ముందస్తు ఆరోగ్య పరీక్షలు, ఉచిత మందులు, ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని మంత్రి కొనియాడారు. ?ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన, నిరంతరం మందుల లభ్యత, నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామని మంత్రి వెల్లడించారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలవడమే తమ ప్రభుత్వ ధ్యేయమని, భవిష్యత్తులో కూడా కొండేపి నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని ఆయన చెప్పారు. ?ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, ప్రజలు , స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఏలూరుపాడులో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**ప్రాముఖ్యతను తెలిపిన సూపర్వైజర్ కామేశ్వరి**





**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 04**

ఉలవపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గుడ్లూరు మండలంలోని సెక్టార్ లో ఏలూరుపాడు పంచాయతీ నందు సిడిపిఓ మాధవీలత ఆదేశాలు మేరకు సూపర్వైజర్ కె.కామేశ్వరి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి సూపర్వైజర్ తెలియజేశారు. పుట్టిన మొదటి గంటలోపే తల్లిపాలు బిడ్డకు పట్టించాలని, తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన బెడ్ కిరోక నిరోధక శక్తిని పెంపొందించి అంటువ్యాధుల నుండి రక్షిస్తాయని తెలియజేశారు. తల్లిపాలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉండి సరైన ఉష్ణోగ్రతలు ఉండి కలుషితం కాకుండా సిద్ధంగా ఉంటాయని, తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లి బిడ్డల మధ్య ప్రేమ ఆప్యాయత భద్రతను పెంచే అమూల్యమైన బంధం ఏర్పడుతుందని, తల్లిపాలు బిడ్డకు ఇవ్వటం వలన డయేరియా, నిమోనియా , ఇన్ఫెక్షన్ లాంటి వ్యాధుల నుండి రక్షిస్తాయని, తల్లిపాలు తాగే బిడ్డలు ఆత్మవిశ్వాసం మానసిక ప్రశాంతత భావోద్వేగ వికాసం మెరుగ్గా ఉంటుందన్నారు మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలని, ఇంకా ఇతరహార పదార్థాలు పెట్టకూడదు అని, తల్లిపాలు ఇవ్వడం వలన బిడ్డకు మెదడు శరీర ఎదుగుదలకు, తెలివితేటలు జ్ఞాపకశక్తి అభివృద్ధికి తల్లిపాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమమైన సంపూర్ణ ఉచిత పోషకాహారమే తల్లిపాలు అని, తల్లిపాలు తాగే పిల్లలు ఆరోగ్యంగా ఎదిగి ఊబకాయం మరియు కొన్ని దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం నుండి బయటపడతారు అని సూపర్వైజర్ కామేశ్వరి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పంచాయతీలోని అంగన్వాడీ కార్యకర్తలు పి.తిరుపతమ్మ, మాలకొండమ్మ ప్రసన్న తదితరులు హాజరయ్యారు.

# ప్రత్యేక బియ్యం కౌంటర్లు ప్రారంభం

**- బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే కేజీకి 12 రూపాయల వరకు తగ్గుదల - జిల్లా పౌరసరఫరాల అధికారి పద్మశ్రీ**

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 04**

బహిరంగ మార్కెట్ లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులో ఉంచేలా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం కౌంటర్లను జిల్లా పౌరసరఫరాల అధికారి పద్మశ్రీ, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వరలక్ష్మి మంగళవారం ఒంగోలు నగరంలోని వెంకటేశ్వర రైస్ మిల్లులో ప్రారంభించారు. బిపిటి రా రైస్, స్టీమ్ రైస్ రకాలను ప్రజలకు



పంపిణీ చేస్తామని పద్మశ్రీ తెలిపారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోల్చితే ఒక్కో కేజీకి సగటున రూ.10 – 12 రూపాయల వరకు తక్కువ ధరకే ఈ కౌంటర్ లో లభిస్తాయి అన్నారు. పేదలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. బియ్యం కోసం వచ్చేవారు ఆధార్ కార్డును తీసుకురావాలని సూచించారు. ఒక్కో మనిషికి నెలకు 10 కేజీల చొప్పున పంపిణీ చేస్తామన్నారు.

## చేవూరు గిరిజన సంఘంలో మంచినీటి కష్టాలు

**పట్టించుకోని అధికారులు.**

**శంఖారావం సర్వే బృందానికి తెలిపిన గిరిజనులు.**



**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు04**

మండలంలోని చేవూరు గ్రామంలో, గిరిజన సంఘంలో గత నాలుగు నెలల నుండి మంచినీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నామని, గిరిజనులు శంఖారావం యాత్ర బృందము ఎదుట గిరిజనులు వాపోయారని జి. వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐటీయూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో చేవూరులో సర్వే నిర్వహించారన్నారు. గిరిజన సంఘంలో పైప్ లైన్ చెడిపోయిన కారణంగా, గత నాలుగు నెలల నుండి , మంచినీళ్లు రావటం లేదని, ఒక ట్యాంకరు 600 రూపాయలు పెట్టి కొనుక్కుంటున్నామని, శంఖారావం యాత్ర బృందానికి గిరిజనులు విన్నవించుకున్నారు. అప్పటివరకు ఉచితంగా ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని, స్థానిక సచివాలయంలో అర్జీ కూడా ఇచ్చామని కానీ, ఇప్పటివరకు పరిష్కారం కాలేదని వారు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ, వెంటనే చేవూరు గిరిజన సంఘానికి ఉచితంగా మంచినీరు సరఫరా చేయాలని, లేకుంటే మండల కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. అలానే చేవూరు ఎస్సీ కాలనీలో, గత గత 50 సంవత్సరాలు నుండి సాగు చేస్తున్న 13 ఎకరాల భూమి పోర్టు రోడ్డు కోసం తీసుకొని ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదని. ఆ భూమిని నమ్ముకున్న దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని, వెంటనే ప్రభుత్వం స్పందించి దళితులకు నష్టపరిహారం చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ కాలనీలో కొన్ని ప్రాంతాలలో రోడ్లు సక్రమంగా లేవని, వీధి దీపాలు వెలగడం లేదని, యాత్ర బృందానికి తెలియజేశారు. చేవూరు గ్రామంలో సచివాలయ అధికారులు స్పందించి వెంటనే సమస్యలు పరిష్కారం చేయాలని యాత్ర బృందం నాయకులు డిమాండ్ చేశారు. యాత్ర బృందం లో జీ.వెంకటేశ్వర్లు కొట్టే వెంకయ్య, గుత్తి మల్లికార్జున, దామా కృష్ణయ్య, పాలకుర్తి పాలకుర్తి నాగేశ్వరరావు, పొట్లూరి ప్రసాద్, చేవూరి రాజగోపాల్, రాపూరి రమేష్ పాల్గొన్నారు.

## కారు కూతలు కూస్తే సహించేది లేదు

**– జగన్ అండ్‌కోకు మంత్రి**

**డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి హెచ్చరిక**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 04**

డీఎస్సీపై మంత్రి లోకేష్ సవాల్ కి తోక ముడిచిన జగన్ అండ్ కో మీడియా ముందు కారు కూతలు కూస్తే సహించేది లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేష్ గురించి మాట్లాడే స్థాయి, అర్హత వైసిపి నేత ఆదిమూలపు సురేష్ కి లేదన్నారు. డీఎస్సీపై మంత్రి లోకేష్ సవాల్ కి తోక ముడిచిన జగన్ అండ్ కో మీడియా ముందు కారు కూతలు కూస్తే సహించేది లేదన్నారు. డీఎస్సీపై వైసీపీ నాయకులు 350 పైగా పిటిషన్లు వేశారని, కోర్టు చేత చివాట్లు తినడం తప్ప ఏం సాధించారని ఆయన ప్రశ్నించారు. ఒక అబద్దాన్ని పదే పదే చెప్తే ప్రజలు నమ్ముతారనుకోవడం వైసీపీ నాయకుల భ్రమ అని, అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసామని, వైసీపీ హయాంలోనే గ్రూప్ 1 ఉద్యోగాల్లో అవినీతికి పాల్పడి అర్హులైన వారికి అన్యాయం చేశారని ఆరోపించారు. వైసీపీ పాలనలో విద్యా రంగాన్ని నాశనం చేస్తే.. నేడు మంత్రి లోకేష్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి పేద విద్యార్థులకు మేలు చేస్తుంటే ఓర్వలేకనే వైసీపీ విమర్శలు చేస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ గురించి మాట్లాడే ముందు వైసీపీ నాయకులు తమ స్థాయి తెలుసుకోవాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు.



## వీబీజీ--రామ్--జీ పనులపై సమీక్షా సమావేశం

**లక్ష్యాల మేరకు పనులు చేపట్టాలి**

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**





**కొనకనమిట్ల పెన్ పవర్ ఆగష్టు 4**

మార్కాపురం క్లస్టర్ పరిధిలోని మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలకు సంబంధించి వీబీజీ--రామ్--జీ పనులపై నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు.మార్కాపురం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సువార్త,అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మలా దేవి సమావేశంలో పాల్గొని సిబ్బంది పనితీరును సమీక్షించారు.కూలీల పనిదినాల లక్ష్యాల మేరకు పనులు కల్పించడం,ఉద్యానవన పనులు,ప్రాధాన్యతా రంగాల పనులకు అంచనాలు సిద్ధం చేయడం,క్షేత్రస్థాయిలో పనుల పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ సువార్త మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహించకుండా సిబ్బంది క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని సూచించారు.ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టి కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పెండింగ్‌లో ఉన్న పనులకు అంచనాలు సిద్ధం చేసి త్వరితగతిన పనులు ప్రారంభించాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఏపీఓలు,ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కంప్యూటర్ ఆపరేటర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

**ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు నిర్వాసితుల వినతిపత్రం**



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగష్టు 4**

పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ,పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ మంగళవారం వినతిపత్రంఅందజేశారు .తరతరాలుగా నివాసముంటున్న సొంత గ్రామాలను, భూములను, నివాస గృహాలను ప్రాజెక్టు కోసం ఖాళీ చేసి తీవ్రమైన ఆందోళనలో ఉన్నామని, ప్రభుత్వం ఉదారంగా స్పందించి తమను అన్ని విధాలా ఆదుకోవాలని ఈ సందర్భంగా నిర్వాసితులు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు కోసం తమ భూములు, ఇళ్లను త్యాగం చేసిన నిర్వాసితుల త్యాగం అమూల్యమైనదని, నిర్వసితుల తరుపున పోరాడుతానని అన్నారు.వినతిపత్రంలో పేర్కొన్న ప్రతి సమస్యను, ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయడం, కటాఫ్ తేదీ మినహాయింపు, గజెట్‌లో మిస్సయిన కుటుంబాల నమోదు తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి అలాగే సంబంధిత ప్రాజెక్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానుఅని హామీ ఇచ్చారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయమైన నష్టపరిహారం, పరిహార ప్యాకేజీలు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, నిర్వాసితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం కో కన్వీనర్ దగ్గుపాటి సోమయ్య, నిర్వాసిత యువకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగష్టు 4**

నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుతమైన పౌరులని, చట్టాలపై అవగాహన కలిగి సమాజంలో ఆదర్శంగా నిలవాలని ఎర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. అజయ్ కుమార్అన్నారు. మంగళవారం ఎర్రగొండపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈవ్‌టీజింగ్, ట్రాఫిక్ నిబంధనలు, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించిన ఎన్డీపీఎస్, చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహిళలు, బాలికలపై వేధింపులు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వంటి వాటి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం ప్రాణాలను కాపాడుతుందని వివరించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని తెలిపారు.ఎస్సై దేవకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. పోక్సో చట్టం ద్వారా చిన్నారుల రక్షణకు కల్పించిన చట్టపరమైన నిబంధనలు, ఎన్డీపీఎస్ చట్టం కింద డ్రగ్స్‌కు సంబంధించిన నేరాలపై అమలయ్యే శిక్షలు, మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎలాంటి వేధింపులు, అనుమానాస్పద సంఘటనలు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది , కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భాషా సాంస్కృతిక యోధుడు మండలి

**- వెంకట కృష్ణారావు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన పోలీస్ శాఖ, పలు సంఘాలు**







**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 04**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం దివంగత మండలి వెంకట కృష్ణారావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వ ఉత్సవంగా జరపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం రాష్ట్రమంతటా ఆయన పేరుతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. **జిల్లా పోలీస్ కార్యాలయంలో..:** తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు విశేష కృషి చేసిన ప్రముఖ విద్యావేత్త, రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఏ.ఆర్. డిఎస్పీ కె.శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పూల మాల వేసి ఘనంగా నివాళ్ళు అరించారు. ఈ సందర్భంగా ఎఆర్ డీఎస్పీ మాట్లాడుతూ ప్రజాసేవే పరమావధిగా భావించి జీవితాంతం ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేసిన ఉన్నతమైన వ్యక్తి మండలి వెంకట కృష్ణారావు అని పేర్కొన్నారు. దివిసీమ ఉప్పెన సంభవించిన సమయంలో బాధితులను ఆదుకోవడంలో ముందుండి సేవలందించిన ఆయన, వేలాది కుటుంబాలకు అండగా నిలిచారని, ఆయన చేసిన సేవలను గుర్తింపుగా "దివిసీమ గాంధీ" అనే బిరుదును పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామరెడ్డి, ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. **నరసం ఆధ్వర్యంలో..:** నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం) ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం హౌసింగ్ బోర్డు కాలనీలోని నరసం కార్యాలయం నందు మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసం కార్యాలయం నందు సంస్థ గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ దివిసీమ గాంధీగా ప్రసిద్ధి చెందిన మండలి వెంకట కృష్ణా రావు పేరు చెప్పగానే ఎవ్వరికైనా స్ఫురించేవి-- గాంధేయ సిద్ధాంతాలు, సమాజ సేవ లక్ష్యాలు, నిరాడంబర విధానాలు అని, ప్రజాశ్రేయస్సంక్షేమ సాధన వైపు పురోగమిస్తూ నిజమైన సంఘ సేవకునిగా, నిరాడంబరత మూర్తీభవించిన వ్యక్తిగా ఎదిగారని చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డా నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ రాజకీయంగా ఆయన చిత్తశుద్ధి, నిజాయితీ ఆయనకు తరగని సంపదని,మంత్రిగా పదవీ స్వీకారం చేసిన వెంటనే తన ఆస్తిపాస్తులను వెల్లడించి క్రొత్త సంప్రదాయాలను నెలకొల్పారని, ఆయన నిగర్వియని, ఆయనలో వినమ్రత ఉట్టిపడుతుందని చాలా గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళామిత్రమండలి(తెలుగు లోగిలి)జాతీయ అధ్యక్షులు డా నూనె అంకమ్మరావు నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లిఖార్జునరావు,యు.వి రత్నం, బీరం అరుణ, పరాంకుశం కృష్ణవేణి , చల్లా కనక దుర్గా,గుంటూరు సత్యనారాయణ , ఓరుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ఒంగోలు కాపునాడు ఆధ్వర్యంలో..:** మండలి వెంకటకృష్ణారావు (దివిసీమ గాంధీ ) ఘనంగా జయంతి వేడుకలు ఒంగోలు కాపునాడు కార్యాలయంలో మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వెంకట కృష్ణారావు జయంతి వేడుకలను అధికారిక హోదాలో నిర్వహించాలని ప్రకటించడం ఎంతో ఆనందదాయకం అని ఒంగోలు పార్లమెంట్ కాపునాడు అధ్యక్షులు పోగుల మల్లికార్జునరావు, జనరల్ సెక్రెటరీ దాసరి పిచ్చయ్య నాయుడు లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ , రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఈమని మదనమోహన్, ఒంగోలు పార్లమెంట్ జాయింట్ సెక్రెటరీ గారా నారాయణ, కోశాధికారి చంగల్ శెట్టి సుధాకర్, మార్కాపురం జిల్లా కన్వీనర్ వెలుగోలు కాశీ విశ్వనాథ్, ఒంగోలు పార్లమెంట్ ఆర్గనైజింగ్ అధ్యక్షులు మేకల నారాయణ, ఒంగోలు నియోజకవర్గం అధ్యక్షులు పోల శీను, ఒంగోలు నియోజకవర్గ యువ కాపునాడు అధ్యక్షులు చెన్ను వెంకట నరేష్, యువ కాపునాడు సెక్రెటరీ తోట సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# అసమర్థుడి చేతిలో విద్యాశాఖ ఉండకూడదు

**డియస్సి పేరిట జరిగిన డబ్బుల దంధాను నిరుద్యోగులు త్రిప్పికొట్టాలి**

**డియస్సి లీకేజి స్కాంకు బాధ్యత వహించి లోకేష్ రాజీనామా చేయాలి**

**రాష్ట్ర వైస్సార్సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్**




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగష్టు 4**

చదువుకున్న యువత ఉపాధ్యాకులుగా స్థిరపడాలని ఆశ పడి డియస్సి పరీక్షలు రాస్తే, దొంగ జీ ఓ లు తెచ్చి అర్హత లేని స్పోర్ట్స్ కోటాలు పెట్టి డియస్సి పేరిట డబ్బుల దంధాచేసి అమ్ముకోవడం లోకేష్ భయంకరమైన కుట్రఅని, అసమర్థుడి చేతిలో విద్యా శాఖ ఉండకూడదని రాష్ట్ర వైస్సార్సీపీ అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయం లో డియస్సి అక్రమాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టెట్, బిఇడి చదివి డియస్సిలో ర్యాంకులు సాధించిన వారికి పక్కన పెట్టి,టీడీపీ కోవర్టులకు, నాయకుల బంధువులకు డియస్సి రాయని వారికీ సూట్ కేస్ కొట్టు ఉద్యోగం పట్టు అన్నట్లుగా గద్దాల్లాగ, పందికొక్కులుగా ఉద్యోగాలు అమ్ముకుని నిరుద్యోగులకు ద్రోహం చేసారని అన్నారు.దేశంలో ఉన్న రాజ్యాంగం అందరికి సమానమేనని, కేంద్ర విద్యా శాఖ మంత్రి నీట్ లీక్ విషయంలో రాజీనామా చేసినట్లు, డియస్సి ప్రశ్న పత్రం లీక్ చేసిన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని యువత కోరుతున్నారని ఆయన అన్నారు.చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని నడపడం లేదని, కార్పొరేట్ వ్యవస్థలను నడుపుతు ధనార్జానేద్యేయంగా పెట్టుకున్నాడని అన్నారు.డియస్సి 2025లీకేజి స్కాం పై సిబిఐ విచారణ చేపట్టాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన కల్పించాలని, ఫిజు రీఅంబుర్స్ మెంట్ చెల్లించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేసారు. నిరుద్యోగ యువతకు మద్దతుగా వైస్సార్సీపీ చేపట్టిన ఉద్యమం గొంతుక కూటమి ప్రభుత్వం కళ్ళు తెరిపించాలని, వైస్సార్సీపీ ఆధ్వర్యంలో జరుగు రిలే నిరాహార దీక్షలు విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలోఐటీ వింగ్ రాష్ట్ర నాయకులు నాగేశ్వర రెడ్డి,మండల పార్టీల అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, గంట వెంకట రమణ రెడ్డి, దోమకాల వెంకటేశ్వర్లు, కృష్ణ రెడ్డి, జడ్పీటీసీ చేదురి విజయభాస్కర్,లింగం రాములు,ఆళ్ల ఆంజేనెయరెడ్డి, నాయకులు, పాల్గొన్నారు.

# చిరస్మరణీయంగా ఒంగోలు మున్సిపాలిటీ 150 ఏళ్ల ఆవిర్భావ వేడుకలు

**దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ రాజాబాబు**



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 04**

ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 ఏళ్లు అయిన సందర్భంగా నిర్వహించే వేడుకలు చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోయేలా ఉండాలని జిల్లా కలెక్టర్.. ఒంగోలు కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. మంగళవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి వీటిపై చర్చించారు. పుస్తక ప్రదర్శనలు, ఆర్ట్ గ్యాలరీలు, హెరిటేజ్ వాక్, ప్రముఖుల చిత్రాలతో ఫేమ్ వాల్ ఏర్పాటు, ప్రత్యేక సావనీర్ ఆవిష్కరణ, మహిళలకు, యువతకు, విద్యార్థులకు ఒంగోలు ఘన చరిత్రను విభిన్న కోణాలలో తెలిపేలా పోటీలు, షార్ట్ ఫిల్ములు, ప్రత్యేక డాక్యుమెంట్ల రూపకల్పన కాంపిటీషన్స్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన చెప్పారు. ' ఫిట్ ఒంగోలు ' పేరుతో నగర పరిధిలో 150 ప్రాంతాలలో మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేయాలన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్ళలో ప్రత్యేక స్మారకాలు నిర్మించడంపైనా దృష్టి సారించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ దిశగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులతో ఈ ప్రణాళికను రెండు మూడు రోజుల్లో ఆవిష్కరించేలా దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, మున్సిపల్ ఇంజనీర్ యెషయా, డీ.ఈ.ఈ. పద్మజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చి దిద్దాలి

**మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్య కుమారి**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 04**

ప్రకాశం జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చి దిద్దేందుకు జిల్లా అధికార యంత్రాంగం పలు చర్యలు చేపట్టాలని అధికారులను మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్య కుమారి ఆదేశించారు. మంగళవారం మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి ప్రకాశం జిల్లాలోని ఐసిడిఎస్ ప్రాజెక్టులలో పెండింగ్ విషయాలు గురించి రివ్యూ సమావేశం ఏర్పాటు చేశారు. అంగన్వాడి భవనాలు, టాయిలెట్స్ పంచాయతి అధికారులతో సమన్వయం చేసుకొని పంచాయితీ నిధులతో పూర్తి చేయాలనీ తెలియజేశారు. అందులో భాగంగా ఉలవపాడు, దర్శి, మద్దిపాడు ప్రాజెక్టులలో టీనేజ్ ప్రెగ్నెన్సీ, స్కూల్ డ్రాప్ అవుట్ ఎక్కువగా ఉన్నట్టు అక్కడ లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమన్వయం చేసుకుని అవగాహన కార్యక్రమం నిర్వహిస్తూ టీనేజీ ప్రెగ్నెన్సీలలో తగ్గుదల చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్ పిల్లలు లేకుండా చూడాలని వారిని స్కూల్లో చేర్పించాలని అలాగే పోస్కో పిల్లలకు త్వరగా న్యాయం జరిగేలాగా చూడాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా బాధిత పిల్లలకు త్వరగగతిన న్యాయం చేయాలని సూచించారు. పిల్లలకు కనీస వయసు రాకుండా వివాహం చేస్తే కఠిన చర్యలు తప్పవని, అటు పోలీసు యంత్రాంగం నుండి ఇటు మహిళా శిశు సంక్షేమ శాఖ తమ వంతు బాధ్యతను నిర్వహించాలన్నారు. ఆడపిల్లలు భారం కాదు కుటుంబ బాధ్యతలో ముఖ్యపాత్ర వహించే వ్యక్తిగా ఆడపిల్లని ఎదగనిద్దాం ఆడపిల్లను చదవనిద్దాం ఆడపిల్లకు బాల్య వివాహాల నుంచి నుంచి విముక్తి ర్యాలీ చేయడంతో పాటు సమాజ అభివృద్ధికి స్త్రీ పాత్ర ఎంతో ముఖ్యమైనదిగా తెలియజేయాలని సూచించారు. ఇలాంటి సంఘటనలు జరిగిన సందర్భంలో 1098 ద్వారా 18 సంవత్సరాల లోపు వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఏ. పద్మ సునంద, డి.సి.పి.ఓ పి. దినేష్ కుమార్, సిడిపిఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సేవల్లో అప్రమత్తంగా ఉండాలి

**ఎంపిడిఓ ఈశ్వరమ్మ**



**కొనకనమిట్ల పెన్ పవర్ ఆగష్టు 4**

మండలంలోని ఇరసలగుండం,బచ్చలకూరపాడు,సిద్ధవరంస్వర్ణ గ్రామ సచివాలయాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.ఈశ్వరమ్మ, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.శ్రీదేవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సచివాలయాల్లోని అటెండెన్స్ రిజిస్టర్,మూమెంట్ రిజిస్టర్‌తో పాటు సిబ్బంది పనితీరును పరిశీలించారు.ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు,సిబ్బంది విధుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు.సచివాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలు,సేవలపై ఆరా తీశారు.అనంతరం గ్రామస్తులకు స్వచ్ఛ రథం వినియోగం,పరిసరాల పరిశుభ్రత,ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ సర్వేలు,ఐవీఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పించారు.గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.